గురువారం 23.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 186 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



జగన్ హయాంలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదు. టీడీపీ ప్రభుత్వం తెచ్చిన పరిశ్రమలను తరిమేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి రాష్ట్ర గౌరవం పెంచింది. చంద్రబాబు, లోకేష్ కృషి చూసి వైసీపీ నాయకులు కడుపుమంటతో కుట్రలకు దిగుతున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**




## రూ.100 కోట్లతో

# ప్రపంచస్థాయి గ్రంథాలయం

**విరాళం ప్రకటించిన దుబాయ్ సంస్థ శోభా గ్రూప్ చైర్మన్ పీఎన్సీ మీనన్**

**ఏపీలో రియాల్టి రంగంలో పెట్టుబడుల అవకాశాలు**

**టౌన్ షిప్ లు, లగ్జరీ హెూటళ్ల నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టండి**

**దుబాయ్ ప్రముఖ రియాల్టీ సంస్థ శోభా గ్రూప్ చైర్మన్ తో సీఎం చంద్రబాబు**

**దుబాయ్, అక్టోబరు 22:** దుబాయ్ లోని ప్రముఖ సంస్థ శోభా రియాల్టి అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం ఏర్పాటుకు ముందుకు వచ్చింది. రూ. 100కోట్ల విరాళంతో వరల్డ్ క్లాస్ లైబ్రరీని నిర్మించనుంది. ఏపీలో పెట్టుబడి అవకాశాలు వివరించేందుకు దుబాయ్ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుతో ఆ దేశంలోని శోభా రియాల్టి ఫౌండర్ చైర్మన్ పీఎన్సీ మీనన్ తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో లైబ్రరీ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రితో చర్చించారు. శోభా రియాల్టి సంస్థ అమరావతిలో ప్రపంచ స్థాయి స్టేట్ లైబ్రరీ నిర్మించేందుకు ముందుకు రావటంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గ్రంథాలయం నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ప్రకటించటంపై ధన్యవాదాలు తెలియచేశారు. అమరావతిని ప్రపంచంలో అత్యుత్తమ నగరంగా నిర్మిస్తున్నామని సీఎం ఆయనకు వివరించారు. మిగతా 2లో...

## లాజిస్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటుకు రాష్ట్రానికి రండి

- **షరాఫ్ గ్రూప్ సంస్థకు సీఎం చంద్రబాబు ఆహ్వానం**




**దుబాయ్, అక్టోబర్ 22:** షరాఫ్ గ్రూప్ వైస్ ఛైర్మన్, షరాఫ్ డీజీ సంస్థ వ్యవస్థాపకుడు షరాఫుద్దీన్ షరాఫ్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలపై షరాఫ్‌తో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మౌలిక వసతులు, మానవ వనరుల లభ్యత, అలాగే ఇతర అనుకూలతల గురించి వివరించారు. బుధవారం యూఏఈలో తొలిరోజు పర్యటనలో భాగంగా షరాఫ్ గ్రూప్ వైస్ చైర్మన్‌తో సమావేశమైన సీఎం... ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ ప్రాజెక్టుల ఏర్పాటు గురించి ప్రధానంగా చర్చించారు. మిగతా 2లో...



## భారీ వర్షాలు..

# తస్మాత్ జాగ్రత్త

- **అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని రాష్ట్రంలో పలు జిల్లాలకు హెచ్చరికలు వచ్చిన క్రమంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం స్పష్టం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా ఉన్న క్రమంలో రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలు చేపట్టే సహాయక చర్యలు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేటప్పుడు పంచాయతీరాజ్ సిబ్బంది కూడా పాలుపంచుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రైనేజీలు, కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయిన పక్షంలో వాటిని తక్షణమే తొలగించాలని సూచించారు. ఆకస్మిక వరదల హెచ్చరికలు ఉన్న జిల్లాలలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తన కార్యాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

## హైస్కూలు స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలు

- **ఏఐ విప్లవం ద్వారా వచ్చే అవకాశాలను అందుకోవడమే లక్ష్యం**
- **విద్యారంగ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్**



**ఆస్ట్రేలియా (బ్రిస్బేన్):** విద్యారంగ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ భారత్ లో ముందువరుసలో ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విద్యారంగంపై క్వీన్స్ ల్యాండ్ ట్రేడ్ & ఇన్వెస్టిమెంట్ సెంటర్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిగతా 2లో...



## భారత్ - ఆస్ట్రేలియా వాణిజ్యంలో

# ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర

- **భారత్ లో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్**
- **బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్**

**ఆస్ట్రేలియా (బ్రిస్బేన్):** బ్రిస్బేన్ లోని భారత రాయబార కార్యాలయంలో నిర్వహించిన బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సమావేశంలో భారత కాన్సులేట్ జనరల్ (బ్రిస్బేన్) నీతూ ఎం. భాగోటియా ఆస్ట్రేలియా–ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు హాజరయ్యారు. మిగతా 2లో...

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **వాయుగుండం ప్రభావం నేపథ్యంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశం**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంపై వాయుగుండం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

మంత్రి మాట్లాడుతూ, నెల్లూరు జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తుండగా, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఎక్కడ వాగులు పొంగే అవకాశం ఉందో ఆ ప్రాంతాల ప్రజలను ముందుగానే హెచ్చరించాలని, చెట్లు విరిగిపడే చోట ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తీరప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వాయుగుండం ప్రభావంతో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షాలు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించిందని ఆయన తెలిపారు.

ప్రాణనష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల వారీగా కంట్రోల్ రూమ్స్‌ను 24 గంటలు అలర్ట్ మోడ్‌లో ఉంచి సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు సహాయం చేయాలని సూచించారు. మిగతా 2లో...

## పెమ్మసాని చొరవతో ఏపీకి రూ. 665 కోట్లు విడుదల

- **ఉపాధి హామీ కింద మెటీరియల్ కాంపోనెంట్ మంజూరు**
- **విడుదల చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీసుకున్న చొరవ కారణంగా ఉపాధి హామీ పనుల కింద ఏపీకి రూ. 665 కోట్లు విలువైన మెటీరియల్ కాంపోనెంట్ ను కేంద్ర ప్రభుత్వం బుధవారం మంజూరు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కేంద్రం ఈ రూ. 665 కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిధులు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల మెటీరియల్ ఖర్చులకు ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో భాగంగా అవసరమైన మెటీరియల్ నిమిత్తం ఈ కాంపోనెంటును గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ఏడాదిన్నర కాలంగా ఏపీలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించిన వ్యక్తులకు ఈ మెటీరియల్ కాంపోనెంట్ విడుదల దోహదపడుతుంది. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎన్టీఆర్ వైద్య సేవ ఆసుపత్రులకు రూ. 250 కోట్లు విడుదల




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ అనుబంధ (నెట్వర్క్) ఆసుపత్రుల బకాయిల్లో రూ. 250 కోట్లను ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసింది. నిధుల చెల్లింపులపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ తో చర్చించారు. అనంతరం చర్యల్లో భాగంగా నిధుల విడుదలకు మార్గం సుగమమైంది.

అలాగే త్వరలో మరో రూ. 250 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్య సేవల్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్, ఇతర సంఘాల ప్రతినిధులను సౌరభ్ గౌర్ కోరారు. ఈ మేరకు బుధవారం తనని కలిసిన పలువురికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని వివరించారు.

## కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో సంతృప్తి

- **రాష్ట్రంలో 75 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు సంతృప్తి స్థాయిలో ఉన్నారు**
- **ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడి**
- **రాష్ట్ర గృహ నిర్మాణ , సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై రాష్ట్ర ప్రజల్లో 75 శాతం మందికి పైగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైనట్లు రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నాడి, ప్రభుత్వ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించడం జరుగుచున్నదని తెలిపారు. మిగిలన 25 శాతం అసంతృప్తికి కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నామని, నూటికి నూరు శాతం కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు.

రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో ప్రజల సంతృప్త స్థాయి 75 శాతంకు పైగా ఉండటం తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారన్నారు. అయితే నూటికి నూరు శాతం సంతృప్త స్థాయి చేరే-వరకు కృషి చేయాలని ఆయా శాఖాధిపతులను ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రజల అసంతృప్తికి కారణాలు తెలుసుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించడం జరిగిందన్నారు. మిగిలిన అసంతృప్తికి కారణాలు అధికారుల వైఫల్యమా, ప్రజా ప్రతినిధుల వైపల్యమా తెలుసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారని మంత్రి పార్థసారథి తెలిపారు. విద్యుత్ వినియోగంలో లో ఓల్టేజీ, విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. సబ్ స్టేషన్ ఒక యూనిట్ గా తీసుకుని సర్వే నిర్వహించడం జరిగిందన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడి కేవలం ఏడాదిన్నర కాలంలోనే 34 క్యాబినెట్ సమావేశాలు,

# లాజిస్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటుకు రాష్ట్రానికి రండి



(మొదటి పేజీ తరువాయి)

షరాఫ్ గ్రూప్ ఇప్పటికే భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఏపీ చేపట్టిన పారిశ్రామిక కారిడార్లలో ఆధునిక లాజిస్టిక్స్ పార్క్‌లు, గిడ్డంగులు స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీనికి ఆసక్తి చూపిన షరాఫ్ గ్రూప్ తమ అనుబంధ సంస్థ అయిన హింద్ టెర్మినల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, గిడ్డంగి సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరిచింది. ఇందుకోసం రైల్వే, పోర్ట్ అనుసంధానం కలిగిన ప్రాంతాన్ని గుర్తించాలని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

**అవసరమైతే పాలసీల్లో మార్పులు చేస్తాం**

'మా రాష్ట్రంలో పోర్టులు, నేషనల్ హైవేలు విస్తారంగా ఉన్నాయి. కార్గో రవాణాకు రాష్ట్రం అనుకూలం. మేం ఇప్పుడు కొత్త పాలసీలు తెచ్చాం. రాష్ట్రానికి మేలు జరుగుతుందనుకుంటే పాలసీల్లో మార్పులు తేవడానికి సిద్ధం. లాజిస్టిక్స్‌పై 14 శాతం ఖర్చు పెడుతున్నాం. దీన్ని 8 నుంచి 9 శాతానికి తగ్గించాలని చూస్తున్నాం. ఇందుకోసం పోర్టులు, జాతీయ రహదారులు, రైల్వే, రహదారి ప్రాజెక్టులకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. లాజిస్టిక్ వ్యయం తగ్గించడానికి సహకరించండి. రాయలసీమలో ఆటోమొబైల్ పరిశ్రమలు వస్తున్నాయి. నవంబర్ 14,15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడిదారుల సదస్సుకు హాజరుకండి.' అని షరాఫ్ గ్రూప్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి అన్నారు. దీనికి స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని, ఆంధ్రప్రదేశ్‌కు తప్పనిసరిగా వస్తామని చెప్పారు.

# హైస్కూలు స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... అంతర్జాతీయంగా అధునాతన సాంకేతికతలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ లో హైస్కూలు స్థాయి నుంచే ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నామని, ఉన్నత పాఠశాలల్లో ఏఐ ల్యాబ్‌లు, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏఐ విప్లవం ద్వారా వచ్చే అవకాశాలను ఏపీలోని యువత అందుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఏపీలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గవర్నెన్స్ లో ఏఐ వినియోగం ద్వారా అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఏఐ ద్వారా విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో భారత కాన్సులేట్ జనరల్ (బ్రిస్బేన్) నీతూ భాగోటియా, క్వీన్స్ ల్యాండ్ యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్స్ లర్ మార్క్ హార్వే, క్వీన్స్ ల్యాండ్ గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ కమిషనర్ మిచైల్ మాథ్యూస్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ మార్కెట్ గార్బియేల్ ట్రూన్, స్టడీ క్వీన్ ల్యాండ్ అడిషనల్ డైరెక్టర్ స్టెఫానీ హంటర్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ మెరైన్ బయోలజీ, ఆక్వాకల్చర్ ప్రొఫెసర్ క్యాల్ జెంజర్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్వీన్ ల్యాండ్ ప్రొ వైస్ ఛాన్స్ లర్ రెన్ యూ, సిక్యూ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ (ఇంటర్నేషనల్ ఆపరేషన్స్) మీనూ ఇస్సార్, యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ సెంటర్ డైరెక్టర్ (క్వాంటమ్ సిస్టమ్స్) ఆండ్రూ రైట్, స్ట్రాటజీ మేనేజర్ శరవణన్, ఎడ్యుకేషన్ క్వీన్స్ ల్యాండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డంకెన్ మెక్ కెల్లర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ - ఆస్ట్రేలియా వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... భారత్-ఆస్ట్రేలియాల నడుమ స్నేహపూర్వక ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతోందని తెలిపారు. భారత్ నుంచి ఆస్ట్రేలియాకు కీలకమైన ఎగుమతుల్లో శుద్ధి చేసిన పెట్రోలియం, ఔషధాలు, ఇంజనీరింగ్ వస్తువులు, విద్యుత్ యంత్రాలు, వస్త్రాలు, ఆభరణాలు, వ్యవసాయ ఉత్పత్తులు ఉండగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని చెప్పారు. 2022 డిసెంబర్ లో అమలులోకి వచ్చిన ఆస్ట్రేలియా-భారత్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ ఇరుదేశాల నడుమ వాణిజ్య సంబంధాలకు గేమ్ ఛేంజర్ గా మారింది. 2020-21 ఇరుదేశాల నడుమ వస్తు వాణిజ్య కార్యకలాపాలు $12.2 బిలియన్ డాలర్లు ఉండగా, 2024-25 నాటికి దాదాపు రెట్టింపు అయి $24.10 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఆంధ్రప్రదేశ్ లో విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అమలు చేస్తోంది. ఫలితంగా గత 16నెలల కాలంలో ఏపీకి రూ. 10లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు వచ్చాయి. ఇటీవల గూగుల్ సంస్థ విశాఖలో రూ. 1.33 లక్షల కోట్లతో ఏఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారతదేశ చరిత్రలో అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా ఉంది. ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ. 1.35 లక్షల కోట్లతో అనకాపల్లి సమీపంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ నిర్మించబోతోంది. ప్రస్తుతం భారత్ లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్ వేగా మారింది. ఏపీలో పరిశ్రమదారుల కోసం సులభతరమైన పాలసీలను రూపొందించి అమలు చేస్తున్నాం. వచ్చేనెల 14,15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే పార్ట్ నర్ షిప్ సమ్మిట్ - 2025కి హాజరై ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్న పారిశ్రామిక పాలసీలు, ప్రోత్సాహకాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు తాగునీరు, విద్యుత్, రవాణా వంటి కనీస సదుపాయాలు అంతరాయం లేకుండా కల్పించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి అన్నారు. ఎక్కడైనా అవాంతరాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వాతావరణ పరిస్థితులపై ప్రజలకు సమయానుకూలంగా హెచ్చరిక సందేశాలు పంపాలని సూచిస్తూ, పునరావాస కేంద్రాల్లో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

ప్రజలు ఏవైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 1800-425-0101 ను సంప్రదించవచ్చని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

# రూ.100 కోట్లతో ప్రపంచ స్థాయి గ్రంథాలయం

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని నిర్మాణంలో శోభా రియాల్టి సంస్థ కూడా భాగస్వామి కావాలని ఆహ్వానించారు. ఏపీకి వచ్చి రాజధాని నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రపంచ స్థాయిలో నగరాలు నిర్మితం అవుతున్నాయని వాటితో సమానంగా మౌలిక సదుపాయాలతో అమరావతిని నిర్మిస్తున్నట్టు సీఎం వివరించారు. గ్రీన్ ఎనర్జీకి రాష్ట్రాన్ని చిరునామాగా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు శోభా గ్రూప్ ప్రతినిధులకు చంద్రబాబు వివరించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు అవుతోందని చంద్రబాబు చెప్పారు. ఇక తిరుపతి, విశాఖ వంటి నగరాల్లో రానున్న రోజుల్లో అనేక మార్పులు రానున్నాయని... మౌలిక సదుపాయాలపై భారీగా ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లో రియల్ ఎస్టేట్ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.

**పోర్టులున్నాయి... కారిడార్లు వస్తున్నాయి**

రాష్ట్రంలో రియాల్టి రంగంలో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాల్లో కూడా




బిజినెస్ ఐటీ పార్కులు, మాల్స్, హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లతో పాటు ఉన్నతశ్రేణి వర్గాలకు హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టేందుకు అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో నిర్మితం అవుతున్న పారిశ్రామిక కారిడార్లు, పోర్టులకు అనుసంధానంగా ఇండస్ట్రియల్ టౌన్ షిప్, హౌసింగ్ ప్రాజెక్టులకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి శోభా రియాల్టీ ఛైర్మన్ పీఎన్సీ మీనన్ కు తెలిపారు. ఈ సందర్భంగా శోభా గ్రూప్ సంస్థ చేస్తున్న ఛారిటీని సీఎం అభినందించారు. తమ ఆదాయంలో 50 శాతాన్ని ఛారిటీగా ఖర్చు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ తాము ఏపీలో పీ4 విధానాన్ని అవలంభిస్తూ అమలు చేస్తున్న జీరో పావర్టీ మిషన్ అంశాలను వివరించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారు. ప్రస్తుతం తమ సంస్థ దుబాయ్ తో పాటు ఓమన్, బహ్రెయిన్, ఖతార్, బ్రూనై దేశాల్లో ప్రాజెక్టులు నిర్వహిస్తోందని శోభా గ్రూప్ ఛైర్మన్ మీనన్ ముఖ్యమంత్రికి వివరించారు. భారత్ లోని 14 రాష్ట్రాల్లోని 27 నగరాల్లో శోభా రియాల్టీ ప్రాజెక్టులు చేస్తోందని.. ప్రత్యేకించి బెంగుళూరు, గుర్గాంవ్, చెన్నై, కేరళలోని హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టామని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం దుబాయ్ ప్రభుత్వంలో సీనియర్ సలహాదారు హోదా పనిచేస్తున్న మీనన్ ఆ దేశం నుంచి కూడా పెట్టుబడులు వచ్చేలా సహకరించాలని కోరారు. వచ్చే నెల నవంబర్14, 15వ తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తున్నామని... ఆ సదస్సుకు రావాలని సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.

# ఏపీలో గ్రిఫిత్ వర్సిటీ ఇండియా సెంటర్ ఏర్పాటుకు లోకేష్ ప్రయత్నాలు

**ఆస్ట్రేలియా (గోల్డ్ కోస్ట్):** గ్రిఫిత్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్) శ్రీమతి మార్నీ వాట్సన్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ గోల్డ్ కోస్ట్ క్యాంపస్ లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్పోర్ట్స్ కళాశాలలో అధునాతన క్రీడా సౌకర్యాలను మంత్రి పరిశీలించారు. గ్రిఫిత్ వర్సిటీ ప్రత్యేకతల గురించి మార్నీ వాట్సన్ వివరాలు తెలియజేస్తూ... 1975లో స్థాపితమైన తమ విశ్వవిద్యాలయం ప్రపంచంలోని అగ్రశ్రేణి పబ్లిక్ యూనివర్సిటీల్లో ఒకటిగా ఉందని చెప్పారు. క్వీన్స్ ల్యాండ్ లో యూనివర్సిటీకి గల ఐదు క్యాంపస్ లలో 50వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. సామాజిక న్యాయం , స్థిరత్వం, ఆవిష్కరణ రంగాల్లో పేరుగాంచిన తమ విశ్వవిద్యాలయం 2027లో బ్రిస్బేన్ సీబీడీలో కొత్త క్యాంపస్ ప్రారంభించబోతోందని తెలిపారు. భారత్ లో ఐఐటీ రూర్కీతో కలిసి సంయుక్త పరిశోధన, స్టూడెంట్ ఎక్ఛేంజి కార్యక్రమాలు, ఆరోగ్యం, నీటివనరులు, టెక్నాలజీ రంగాల్లో అకడమిక్ భాగస్వామ్యం వహిస్తున్నట్లు చెప్పారు.



ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల కోసం ఆంధ్రప్రదేశ్-గ్రిఫిత్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహన కార్యక్రమాలను సమన్వయం చేసేలా గ్రిఫిత్ యూనివర్సిటీ ఇండియా సెంటర్ లేదా హబ్ ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయండి. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధృవీకరణ, గ్లోబల్ అకడమిక్ ప్రమాణాల కోసం ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాలు, APSSDC (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్)తో భాగస్వామ్యం వహించండి. పునరుత్పాదక శక్తి, వాతావరణ స్థితిస్థాపకత, ప్రజారోగ్యం, నీటి నిర్వహణ రంగాల్లో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు ప్రారంభించండి. గ్రిఫిత్ యూనవర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ విద్యాసంస్థల మధ్య డ్యూయల్-డిగ్రీ లేదా ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయండి. (ఉదా: SRM-AP, ఆంధ్రా యూనివర్సిటీ, VIT-AP). స్కాలర్‌షిప్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల అభివృద్ధికి ఎక్ఛేంజి కార్యక్రమాలను ప్రోత్సహించడం). ఈ ఏడాది నవంబర్ 14,15 తేదీల్లో ఏపీలో నిర్వహించే పార్ట్ నర్ షిప్ సమ్మిట్ - 2025, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫోరమ్ సమావేశాలకు హాజరుకండి. గ్రిఫిత్ విశ్వవిద్యాలయ ఆవిష్కరణ, స్టార్టప్ మద్దతునిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో కలసి పనిచేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో సంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

26 ఎస్.ఐ.పి.బి. సమావేశాలను నిర్వహించి రాష్ట్రంలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే అంశాలపై లు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. దాదాపు రూ. 7.65 కోట్ల పైబడి పెట్టుబడులు రాష్ట్రానికి రావడం జరిగిందని, తద్వారా 182 ప్రాజక్టుల్లో 7.21 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుచున్నదన్నారు.

ఉచిత ఇసుక పాలసీ వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం రాకపోయినా త్యాగం చేసి మరీ ఉచిత ఇసుక అందిస్తున్నామన్నారు. అలాగే హౌసింగ్ లో ఏ విషయంలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, హౌసింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించనున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్స్ లో భాగంగా 741 సర్వీస్ లు అందుబాటులోకి మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, కాని ప్రజలు ఆశించినంత స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షలో గుర్తించారన్నారు. ఈ సేవలను యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అవేర్ సాఫ్ట్ వేర్ ద్వారా 42 సర్వీసులు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 27 సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ముఖ్యంగా వేసవిలో వేడి గాలులు, వర్షాకాలంలో పిడుగులు పడే ప్రాంతాలు, భారీ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేసే మెసేజ్ లు ప్రజలకు చేరవేయడంలో ముందున్నామన్నారు. తుఫాన్ ప్రభావంకు గురయ్యే ప్రాంతాలను సైతం ఖచ్చితత్వంతో కూడిన సమాచారం అందిస్తున్నామన్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలకు ఆ సేవలు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

డ్రోన్ పాలసీ రూపొందించిన తర్వాత రాష్ట్రంలో 2,10,047 గంటలకు పైగా డ్రోన్లను వినియోగించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలకు 64,759 గంటలు, ప్రైవేట్ గా 1,45,288 గంటలు వినియోగించడం జరిగిందన్నారు. అలాగే పంట పోలాలకు పురుగు మందులు పిచికారి చేయడానికి లక్షన్నర కు పైగా గంటలు వినియోగించినట్లు వివరించారు. డ్రోన్లు ద్వారా పురుగు మందులు పిచికారి చేయడం వలన ఎంత మేర ప్రయోజనం చేకూరిందన్న అంశంపై గణన జరుగుతుందన్నారు. డ్రోన్ల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూల్ లో తయారైన డ్రోన్లు ఆపరేషన్ సిందూర్ లో వినియోగించామని, వాటి పని తీరు భేష్ అని సాక్షాత్తు ప్రధాని మోదీ మెచ్చుకున్న విషయం ఈ సందర్భంగా గుర్తుచేశారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్బన్ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని, మరిన్ని దరఖాస్తులు వస్తే ఇంకా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గృహాలు లేనివారు నవంబర్ 5 లోపు అర్బన్ హౌసింగ్ కు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పార్థసారథి కోరారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

○ బాల భవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరులోని నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం వసంతరాయపురం లోని లుర్దుస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సుని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా ఏర్పాటు చేశారు



ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకోవడం కేవలం మీ భవిష్యత్తు ను మాత్రమే కాదు, మన దేశ భవిష్యత్తును కుడా ప్రమాదం లోకి నెట్టుతుంది. అని, మత్తుపదార్థాలైన ఆల్కహాల్, పొగాకు, గంజాయి లాంటివాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు, మొదట్లో సరదాగా తీసుకునే మత్తపదార్థాలు క్రమేపీ నియంత్రణ కోల్పోయి మత్తుకు బానిసలు అవుతారనిన్నారు అని, చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటరని, క్యేన్సర్, మరియు ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని స్నేహితులు కానీ మరి ఏ ఇతర వ్యక్తులు కానీ మాదక ద్రవ్యాలపై ప్రలోభపెడితే కచ్చితంగా వద్దు అని చెప్పాలని, మత్తు పధార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అని, మత్తుపదార్థాల వలన ఆరోగ్యం క్షీణించడంతో పాటు సామాజికంగా, ఆర్థికంగా నష్టపోయి కుటుంబ సత్సంబంధాలను కోల్పోతామని తెలిపారు. సరి అయిన అవగాహన లేక మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న వారు ఎక్కువ మంది వున్నారని, ముందుగానే సరి అయిన అవగాహన పెంచుకొని జీవితాలను చక్క దిద్దికోవాలని, అన్నారు ఈ అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు, అనంతరం మదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాము అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు

అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ %వీ% కవిత మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడు లో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని ఈ లాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు మరియు యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన "బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగా సంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 అని అన్నారు

అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మీ బాల శౌరి మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల వలన ఎంతో ఉపయోగ పడుతుందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాల భవన్ వారికీ కృతజ్ఞతలు తెలియజేసారు

ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ కో ఆర్డినేటర్ బి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో కార్తీక అఖండ శివభజనల ప్రారంభం



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్) :** లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం శ్రావణ మరియు కార్తీకమాసాలలో శ్రీశైల దేవస్థానం శివచతుస్సప్తాహ అఖండ భజనలను నిర్వహిస్తోంది. నెలపాటు రేయింబవళ్లు నిరంతరంగా జరిగే ఈ పవిత్ర భజనలు ఈసారి కార్తీకమాసోత్సవాల ప్రారంభ సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ అఖండ భజన కార్యక్రమం మార్గశిర శుద్ధ పాడ్యమి రోజైన నవంబర్ 21వ తేదీ వరకు కొనసాగనుంది.

ప్రారంభ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ప్రధానార్చకులు కె. శివప్రసాద్ స్వామి, అర్చకస్వాములు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా అర్చకులు లోకకల్యాణం కోసం సంకల్పాన్ని పఠించగా, అనంతరం భజన కార్యక్రమం నిర్విఘ్నంగా సాగాలని మహాగణపతి పూజ నిర్వహించారు. ఆ తరువాత చండీశ్వర స్వామివారికి శాస్త్రోక్తంగా విశేష పూజలు జరిపి, అనంతరం శివప్రణవ పంచాక్షరీనామ అఖండ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ అఖండ భజనల్లో కర్నూలు జిల్లా మరియు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆరు భజన బృందాలు పాల్గొననున్నాయి. వీటిలో శ్రీ గురు నిర్మిషాంబ భజన మండలి, కర్నూలు అక్టోబర్ 22 నుండి 27 వరకు, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ నాటక కళాభజన మండలి, కర్నూలు అక్టోబర్ 27 నుండి నవంబర్ 1 వరకు, శ్రీ గంగాభవాని సమేత కేదారేశ్వర స్వామి దేవస్థానం కమిటీ, కర్నూలు నవంబర్ 1 నుండి 6 వరకు భజనలు నిర్వహిస్తాయి.

అలాగే, శ్రీ మౌలీ బసవేశ్వర భజన సంఘ్, గోపనదేవరహళ్లి (రాయచూర్ జిల్లా) నవంబర్ 6 నుండి 11 వరకు, శ్రీ మల్లికార్జున భజన మండలి, సుంకేశ్వరహాల్ (రాయచూర్ జిల్లా) నవంబర్ 11 నుండి 16 వరకు, శ్రీ ప్రభులింగ సేవా సంఘ్, గోపనదేవరహళ్లి, రాయచూర్ నవంబర్ 16 నుండి 21 వరకు అఖండ భజనలో పాల్గొంటాయి.

శ్రీశైలం ఆలయ ప్రాంగణం ఈ పవిత్ర కాలంలో "ఓం నమశ్శివాయ" నినాదాలతో మారుమోగనుంది. భక్తులు ఈ ఆధ్యాత్మిక భజన కార్యక్రమంలో పాల్గొని దివ్యానుభూతిని పొందాలని దేవస్థానం అధికారులు కోరారు.

# స్త్రీశక్తి పథకం విజయానికి వెంటనే బస్సులు, సిబ్బంది అవసరం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తి పథకం విజయవంతం కావాలంటే తక్షణమే 3,000 కొత్త బస్సులను కొనుగోలు చేసి, అన్ని కేటగిరీల్లో 10 వేల మంది సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. బుధవారం మంగళగిరి సిపిఐ కార్యాలయంలో జరిగిన గుంటూరు జిల్లా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఉద్యోగులు స్త్రీశక్తి పథకాన్ని సమర్ధంగా అమలు చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని, కానీ నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా ఆర్టీసీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. స్త్రీశక్తి పథకానికి సంబంధించిన రాయితీ డబ్బులు రూ. 500 కోట్లను ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీకి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిధులు రాకపోతే డీజిల్ కొనుగోలు చేయలేక బస్సులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

అలాగే స్త్రీశక్తి పథకం అమలు సమయంలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు అర్థం చేసుకోకుండా, రాష్ట్రంలోని పలు డిపోలలో కండక్టర్లను సస్పెండ్ చేస్తూ, ఉద్యోగాల నుండి తొలగించడం అన్యాయమని ఆయన అన్నారు. ఇలాంటి చర్యలు కొనసాగితే ఆ అధికారుల వైఖరిని ఆర్టీసీ విసి, యం.డి దృష్టికి మరియు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని, పరిస్థితి మారకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దామోదరరావు హెచ్చరించారు.

జిల్లాలో ఉన్న రవాణా సమస్యలు, మంగళగిరి ఎస్.టి.ఐ, కొంతమంది సూపర్‌వైజర్లు, అధికారుల వైఖరి, సిక్కులపైన జీతాల చెల్లింపు వంటి అంశాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీటి పరిష్కారం కోసం గుంటూరు జిల్లా రవాణా అధికారికి మెమోరాండం ఇచ్చినప్పటికీ పరిష్కారం రాకపోతే ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, జిల్లా కార్యదర్శి ఇ. విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. శ్రీనివాసరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డి.వి. స్వామి, మంగళగిరి డిపో కమిటీ అధ్యక్షులు బాడిస సాంబశివరావు, వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరయ్యారు.

## ఒత్తిడి వదిలి.. ఉత్సాహంగా కదిలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**ప్రతి నిత్యం దరఖాస్తులతో కుస్తీపడే రెవెన్యూ ఉద్యోగులు క్రీడల్లో పోటీపడ్డారు. విధి నిర్వహణలో ఒత్తిళ్ల మధ్య సతమతమయ్యే వారు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆటలాడారు. నువ్వా నేనా అంటూ ప్రతిభకు పదును పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల అనంతపురంలో జరగనున్న రెవెన్యూ క్రీడలకు సంబంధించి గుంటూరు జిల్లా ఎంపిక పోటీలను బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకట్రావు ఆధ్వర్యంలో రన్నింగ్, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ షాట్ పుట్ వంటి క్రీడా పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నామని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ సెలక్షన్స్ కు అనుమతులు ఇచ్చిన కలెక్టర్, జేసీ, డీఆర్వో, సబ్ కలెక్టర్, ఆర్డీవోలకు, పోటీలకు సహకరించిన ఏవో, సెక్షన్ సూపరింటెండెంట్స్, తహసీల్దార్లకు ఉద్యోగుల తరపున ధన్యవాదాలు చెప్పారు.

## తాడికొండ శివారు కాలనీ శుభ్రపడింది



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** తాడికొండ గ్రామపంచాయతీ పరిధిలో శివారు కాలనీలో గురువారం శుభ్రం చేయడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్పందించారు

గ్రామపంచాయతీ కార్యదర్శికి తక్షణం ఆదేశాలు జారీ చేశామని, ఆ మేరకు వెంటనే చర్యలు చేపట్టి తాడికొండ గ్రామపంచాయతీ శివారు కాలనీలలో శుభ్రపరచడం జరిగిందన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనం మరమ్మతులకు గురి కావడంతో రోజు వారి చెత్త సేకరణలో కొంత జాప్యం జరుగుతోందని, వాటిని త్వరలో మరమ్మతులు పూర్తి చేసి రోజువారి చెత్త సేకరణ చేపట్టడం జరుగుతుందని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్త సేకరణ చేస్తున్నారని, విద్యుత్ దీపాలు సక్రమంగా నిర్వహించుటకు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

## పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లాబ్యూరో(జర్నలిస్ట్ ఫైల్):** పురపాలక సేవలను ఇంటి వద్ద నుండే ఫోన్ ద్వారా పొందడానికి వీలుగా రూపొందించిన పురమిత్ర యాప్ ని గుంటూరు నగర ప్రజలు విస్తృతంగా ఇప్పటికే 25 వేల మంది డౌన్లోడ్ చేసుకున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పురమిత్ర యాప్ ద్వారా షుమారు 122 రకాల పురపాలక సేవలను చేతిలోని ఫోన్ ద్వారానే పొందవచ్చన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలను పొందే యాప్ ని నగర ప్రజలు విస్తృతంగా డౌన్లోడ్ చేసుకొని వినియోగిస్తున్నారన్నారు. సేవల కోసం దరఖాస్తులను ఎప్పటికప్పుడు వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ కూడా ఉండడంవలన ప్రజలకు తమ సమస్య, లేదా తమ దరఖాస్తు స్థితి తెలుసుకోవచ్చున్నారు. ప్రతి దరఖాస్తు పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉన్నందున సిబ్బంది కూడా భాద్యతగా వ్యావహరిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలకు పురమిత్ర యాప్ వినియోగం, ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోవడంపై అవగాహన కల్గిస్తున్నామని, ఇంకా ఎవరైనా డౌన్లోడ్ చేసుకోకుంటే వెంటనే చేసుకోవాలని కోరారు.

## హజరత్ మహబూబ్ సుభాని గ్యార్మీ వేడుకలులి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):**మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలోని రైల్వే స్టేషన్ వద్ద గల హజరత్ మహబూబ్ సుభాని గ్యార్మీ పండుగ గొప్ప ఊరేగింపులు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్ ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా జరిపారు. కార్యక్రమం ప్రారంభంలో జండా జెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించి, సాంప్రదాయ భక్తి ఆచారాలతో గొప్ప ఊరేగింపును ప్రారంభించారు. ఈ ఉత్సవానికి హిందువులు, ముస్లింలు కలిసి, సాంఘిక ఐక్యమంతా ప్రతిబింబించే విధంగా పాల్గొన్నారు. గ్యార్మీ పండుగ ద్వారా ఐక్యత, సమాజానికి సేవ మరియు పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందించుకోవడం ముఖ్యమని అన్నారు. ముఖ్యంగా, ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించడం, ఇతరుల పట్ల ప్రేమాభిమానాలను కాపాడుకోవడం ప్రజలలో సానుకూల భావనలను పెట్టింది అని తెలిపారు.. ఈ విధంగా పెద్దవడ్లపూడి గ్రామంలోని హాజరత్ మహబూబ్ సుభాని గ్యార్మీ పండుగను భక్తిశ్రద్ధ, ఐక్యత మరియు సామూహిక సన్మానంతో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పాల్గొన్న టిడిపి నాయకులను ఘనంగా సన్మానించారు.

# పాటిబండ్ల నరేంద్ర విగ్రహాన్ని ఆవిష్కరించిన ఆలపాటి, ధూళిపాళ్ల







**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** శ్రమయే పెట్టుబడిగా అనుకున్న లక్ష్యాలు సాధించి, విద్యాబుద్ధులు నేర్చిన, ఊరిపై మమకారంతో ఎన్నో సేవాకార్యక్రమాలు,ఫలితం ఆశించకుండా చేసిన పరోపకారి పాటిబండ్ల నరేంద్రనాద్ అని, భౌతికంగా ఆయన లేకపోయానా అభిమానుల హృదయాల్లో చిరంజీవిగా ఉంటారని, నరేంద్రనాద్ విగ్రహ ఆవిష్కరణ సభలో ఆత్మీయ అతిధులుగా పాల్గొన్న,పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ తమ అభిప్రాయాలను సభికులతొ, పంచుకున్నారు.

స్థానిక చినరావూరులోని వాసిరెడ్డి వారి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం, తెనాలి పట్టణానికి సుపరిచితులైన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, వితరణశీలి, పాటిబండ్ల నరేంద్రనాథ్ 61వ జయంతిని పురస్కరించుకొని, ఆయన విగ్రహాన్ని, స్కూల్ ప్రాంగణంలొ, ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్, మాజీమంత్రిణి నన్నపనేని రాజకుమారీ, తదితర కుటుంబ సభ్యులు అభిమానుల సమక్షంలో ఘనంగా విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో, పాటిబండ్ల నరేంద్రనాథ్ సేవనిరతిని, విశిష్ట వ్యక్తిత్వాన్ని, సాధారణ స్థాయి నుండి, అసాధారణ స్థాయికి వ్యాపారవేత్తగా ఎదిగినా, తెనాలి ప్రాంతం పై ఉన్న మక్కువతో, ఆయన ఈ ప్రాంతానికి అందించిన సేవలను వక్తలు తమ ప్రసంగాల్లో వివరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విలక్షణమైన ఆలోచన విధానం, పార్టీ పట్ల అంకిత భావం, కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడంలో, బాధ్యతాయుతమైన విధానం, అన్నీ కలిసి, సమాజానికి తానేదో చేయాలని సంకల్పంతో జీవించినంత కాలం శ్రమించిన మహా మనిషి నరేంద్రనాథ్ అని నివాళులర్పించారు. ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొన్నూరు ప్రాంతానికి చెందిన వాడైనా, తెనాలి ప్రాంతంలో, పార్టీకి, సమాజానికి, విలువైన సేవలు అందించిన మంచి మనసున్న మనిషి, తనకు అత్యంత ఆప్తుడు, నరేంద్రనాథ్ అని, మనుషులు భౌతికంగా లేకపోయినా, వారు చేసిన మంచి పనులు పదిలంగా మనసులో ఉంటాయని నివాళి అర్పించారు. మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ జనన మరణ జీవన గమనంలో, మరణం తర్వాత కూడా మనుషుల్లో నిలిచిపోయేవారు కొందరే ఉంటారని, ఆ కొందరిలో నరేంద్రనాథ్ ఒకరిని ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఇదే క్రమంలొ ఇటీవల మెగా డిఎస్సిలొ ఉద్యోగాలు సాధించిన, స్కూల్ఉపాధ్యాయినీలను, సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ రామ అప్పలనాయుడు, ఎంఈఓ లు,మేకల లక్ష్మీనారాయణ, జయంత్ బాబు, నరేంద్రనాద్ కుటుంబసభ్యులు, అన్నపూర్ణ హర్షవర్ధన్ నందిని, శ్రీహర్ష మోనిక, రవీంద్ర,తెలుగుదేశం పార్టీ పట్టణ అద్యక్షులు కుద్ధూస్,పసుపులేటి త్రిమూర్తులు, జొన్నాదుల మహేష్, పలువురు అభిమానులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ప్రసూతి సమయంలో వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**ఆధునిక వైద్య విధానాలు అందుబాటులో ఉన్న తరుణంలో ప్రసూతి సమయంలో అందించే సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని%ొ% పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు ఇందుకు సంబంధించిన సేవలపై అనుభవజ్ఞులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం క్యాంపు కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కలెక్టర్, పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పడా) ప్రాజెక్ట్ డైరెక్టర్ తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలుకి చెందిన దొండపాటి శ్రీదుర్గ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బిడ్డను ప్రసవించిన అనంతరం అపస్మారక స్థితికి చేరుకోవడం, కాకినాడ ఆసుపత్రికి తరలించగా మృతి చెందిన ఘటనపై సమీక్ష నిర్వహించారు.

ప్రసూతి సమయంలో వైద్య సేవల విషయంలో ఏ దశలోనూ నిర్లక్ష్యంగా ఉండకూడదని, అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గర్భిణులకు వైద్యం నుంచి ప్రసవం వం-కూ, అనంతర వైద్యం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సక్రమంగా అందాలని చెప్పారు. పిఠాపురం



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలి విధి నిర్వహణ తీరు, ఇతర సిబ్బంది వ్యవహారంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. పిఠాపురం ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, నియోజకవర్గంలో వైద్యం అందించే విధానం అందరికీ ఒక మోడల్ గా నిలవాలని.. ఆ దిశగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

కాకినాడ జిల్లాలో మెటర్నల్ డెత్ ఆడిట్ నిర్వహణ గురించి ఆరా తీశారు. ప్రసూతి మరణాలు సీరియస్ గా తీసుకోవలసిన అంశమనీ, ఇలాంటి మరణాలు సంభవించినప్పుడు తక్షణమే నిపుణులైన వైద్యుల బృందంతో సమగ్రంగా విచారణ చేసి కారణాలను నమోదు చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శ్రీదుర్గ ప్రసూతి మరణంపై, పుట్టిన బిడ్డ ఆరోగ్య స్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

జిల్లాలోని కొన్ని ఆసుపత్రులపై వైద్యులు, ఇతర సిబ్బంది తమ విశ్వాసాల ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ప్రస్తావించి -ప్రభుత్వ ఆసుపత్రులను వ్యక్తిగత విశ్వాసాల ప్రచారానికి వేదికలుగా చేయకూడదన్నారు.

పిఠాపురం నియోజకవర్గం చేబ్రోలుకి చెందిన శ్రీదుర్గ మరణంపై డిప్యూటీ సీఎంవిచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ కాన్ఫరెన్స్ లో శాసనమండలి విప్ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీ కృష్ణ తేజ, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ చైత్ర పాల్గొన్నారు.

## పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పకడ్బందీగా నిర్వహించాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు, అక్టోబరు 22 : జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించటంతో పాటు రక్షిత తాగునీరు సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గుంటూరు, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ, తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణాల్లో మంచినీటి సరఫరా, వ్యర్థాల సేకరణ, నిర్వహణ, సాలిడ్, లిక్విడ్ వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులు, మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు, వివిధ అంశాలపై ప్రజల ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో యూజీడీ పనులు, అమృత్ 1.0 ఫేజ్ 2 పనులు, పీవీకే నాయుడు అభివృద్ధి ప్రాజెక్టు, ఆర్వోబీ ప్రాజెక్టులు, ఎంటీఎంసీ పరిధిలో సీఆర్డీఏ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు అధికారులు తెలిపారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శానిటేషన్, మున్సిపల్ సేవలు, మంచినీటి సరఫరా పై ఐవీఆర్ఎస్ ద్వారా స్వీకరిస్తున్న ఫీడ్ బ్యాక్ ను మరింతగా మెరుగుపర్చేలా అధికారులు చర్యలు



తీసుకోవాలన్నారు. రానున్న నెలరోజుల్లో పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టి వ్యర్థాల సేకరణ , తరలింపు, కాల్వలు శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పట్టణాల్లో వ్యర్థాలు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ కు తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి ప్రాజెక్టుల నిర్వహణకు చొరవ తీసుకోవాలని సూచించారు. పట్టణ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టల్స్ లో పారిశుద్ధ్యం, తాగునీరు మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈట్ స్ట్రీట్స్, స్వయం సహాయక సంఘాల స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. త్రాగునీటి నమూన ఫలితాలు రియల్ టైంలో మానిటరింగ్ చేసే సిస్టంను అమల్లోకి తీసుకురావాలన్నారు.

సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, ఎంటీఎంసీ అదనపు కమిషనరు శకుంతల, తెనాలి మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్, నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటి ప్లానర్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్లు వెంకటకృష్ణయ్య, శ్రీనివాస్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరులు కోటేశ్వరారావు, విష్ణుమూర్తి, వేణుగోపాల్, ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనరు శ్రీకాంత్ ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లాలో భారీ వర్షం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఏపీలోని ప్రకాశం, వైఎస్ఆర్ కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షాలు పడ్డాయి.

కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమలోని పలు చోట్ల వర్షం పడుతోంది.

నెల్లూరు జిల్లాలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తోంది. ఏఎస్ పేట వద్ద గాలులకు చెట్లు విరిగిపడ్డాయి. పలు చెరువుల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. చేజెర్ల, అనంతసాగరం ప్రాంతాల్లో వరి పంట నీటమునిగింది. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యా సంస్థలకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సెలవు ప్రకటించారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల దృష్ట్యా ఆయా జిల్లాల కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కడప జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. కాలువల్లో వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని నగరపాలక సిబ్బంది తొలగిస్తున్నారు. అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు.

**పొంచి ఉన్న వాయుగుండం ముప్పు**

రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉంది. నైరుతి బంగాళాఖాతం-ఉత్తర శ్రీలంక మధ్య అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్యంగా కదిలి నైరుతి, పశ్చిమ



బంగాళాఖాతం మధ్య మధ్యాహ్నం వాయుగుండంగా మారే అవకాశముంది. వాయవ్యంగా కదిలి 24 గంటల్లో వాయుగుండం మరింత బలపడే అవకాశముంది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా వైపు వాయుగుండం కదిలే అవకాశముంది. తమిళనాడు, కేరళలో వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మధ్యాహ్నం నుంచి తీరం వెంట 30-45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.

## గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ లో బాలల పరిరక్షణపై అవగాహన



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు ఎన్టీఆర్ బస్ స్టేషన్ ప్రాంగణం లో గుంటూరు జిల్లా ప్రజా రవాణా దికారి సిహెచ్ విమల అధ్యక్షతన బస్ డ్రైవర్లు, కండక్టర్స్, సిబ్బందికి బాలల పరిరక్షణ పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమములో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ పిల్లలను వివిధ రకాల దుర్వినియోగం, దోపిడీ, హింస, నిర్లక్ష్యం, బాల కార్మికులు, బాల్య వివాహాలు వంటి హానికరమైన పరిస్థితుల నుండి రక్షించాలి అన్నారు . బాలలు , యువతను మాదకద్రవ్యాలనుండి రక్షించాలి అని, సమాజంలో అందరం సమానమే అని, ప్రతి ఒక్కరు తమ వంతు భాద్యతగా మాధకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని, మాధకద్రవ్యాల వినియోగం వల్ల నేర ప్రవృతి పెరుగుతుందని గంజాయి, డ్రగ్స్ సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి అందించాలని ఆయన కోరారు.

అనంతరం మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడు లో బోస్కో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసింది అని చెప్పారు. ఇలాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు,యువతకు నూజివీడు మండలం పొలసానపల్లి లో ఏర్పాటు చేసిన " బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఉచితంగా సంప్రదించవచ్చు అని సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490492020 తెలిపారు.

ఈ కార్యక్రమములో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సాంబశివ, బస్ డ్రైవర్లు, కండక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు

## అయ్యప్ప స్వామి కృపవల్లే చద్ది కార్యక్రమంలిఅన్నం సతీష్ ప్రభాకర్‌లి



**బాపట్ల జిల్లా(జర్నలిస్ట్ ఫైల్):** అయ్యప్ప స్వామి ఆశీస్సులతోనే గత 21 సంవత్సరాలుగా చద్ది కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నానని భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. కార్తీక మాసం మొదటి రోజు సందర్భంగా శ్రీ పార్వతీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో మాలదారులకు చద్ది కార్యక్రమాన్ని అన్నం సతీష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. మొదటిగా అన్నం సతీష్ ప్రభాకర్ అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పడి వెలిగించి చద్ది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ చద్ది కార్యక్రమాన్ని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నప్పటికీ ఎందరో కృషి ఈ కార్యక్రమంలో ఉందన్నారు. ఆర్థికపరంగా తాను చూసుకుంటున్నప్పటికీ తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు చద్ది కార్యక్రమం ప్రతిరోజు ముగిసే అంతవరకు ఎందరో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వామివారి సేవలో లీనం అవుతున్నారు అన్నారు. వారందరి సహకారంతో గత 21 సంవత్సరాలుగా ఆ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో మాలధారులకు చద్ది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని చెప్పారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఉన్నంతకాలం తాను విజయవంతంగా చద్ది కార్యక్రమాన్ని కొనసాగిస్తానని వివరించారు. 41 రోజులపాటు చద్ది కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చద్ది కార్యక్రమంలో సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బుర్లె రామ సుబ్బారావు, గురు స్వామి సుబ్బారావు, బిజెపి మాజీ జిల్లా పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, బిజెపి నియోజకవర్గ బాధ్యులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ రాష్ట్ర సారథిగా ఈశ్వరయ్య


- ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ సమితి
- అధికారికంగా ప్రకటించిన రాజా
- రామకృష్ణ స్థానంలో బాధ్యతలు



**విజయవాడ, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ దాసరిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర సమితి మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండాలు పాల్గొన్నారు. పి.దుర్గాభవానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య పేరును జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రతిపాదించగా... కాస్త నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు బలపర్చారు. కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య విద్యార్థి దశ నుంచి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌లో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, రైతు తదితర ఉద్యమాల్లో తనదైన ముద్రవేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటాలు నిర్వహించారు. ఇంతవరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగాను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈశ్వరయ్య ఇకపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఈశ్వరయ్యకు డి.రాజా, రామకృష్ణ పాండా, కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈశ్వరయ్య నేతృత్వాన పార్టీ బలోపేతం కావాలని, బలమైన ప్రజా ఉద్యమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఒంగోలులో ఆగస్టు 23 నుంచి 25 వరకు జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కౌన్సిల్ 102 మందితో ఏర్పడింది. వారిలో 33 మందిని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికవ్వగా, రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక వాయిదా పడింది. జాతీయ మహాసభల అనంతరం రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకుంటామని పార్టీ నాయకత్వం ప్రకటించింది. జాతీయ మహాసభలు ముగియడంతో, తాజాగా ఈశ్వరయ్య ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా డి.రాజా ప్రకటించారు.

# అనాథలు,యాచకులు, వృద్ధులను వృద్ధాశ్రమాలకు తరలించిన ట్రాఫిక్ పోలీసులు



**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

ఇబ్రహీంపట్నం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల అనాథలు, వృద్ధులు,యాచకులను వృద్ధా శ్రమాలకు తరలించడం జరిగింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఎస్ఐ బి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ కమిషనర్ గారి ఆదేశాల మేరకు సి ఐ చంద్ర శేఖర్ గారి పర్యవేక్షణలో నేషనల్ హైవే కి అనుకోని ఉన్న బస్ షెల్టర్ లో నివాసం ఉంటూ యాచకత్వం సాగిస్తూన్న అనాథలు, వృద్ధులు,మతిస్థిమితం లేని వారిని గుర్తించి ప్రత్యేక వాహనంలో వృద్ధాశ్రమాలకు తరలించాలని తరలించడం జరిగిందని తెలిపారు.వీరు తరచూ రోడ్డుప్రమాదాలగురవుతున్నారని తెలిపారు. యాచకత్వం చేసే సమయంలో రోడ్లు దాటుతూ ప్రమాదాల గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఇప్పటికే పలు ప్రాంతాల్లో పలునగరాల్లో యాచకులను ప్రత్యేకమైన ఆశ్రమాలకు తరలించాలని ఆదేశాలు ఉన్నాయని,ఈ క్రమంలో నేడు 10మందిని వృద్ధాశ్రమాలకు తరలించడం జరిగిందన్నారు.

# ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించిన ఏ వి పి ఎన్ సభ్యులు



**మైలవరం, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

రాష్ట్రం లో రైతు సాధికార సంస్థ ద్వారా "ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం"పేరు తో అమలు చేస్తున్న ప్రతి వ్యవసాయంపై అవగాహన పెంచుకునేందుకు మిస్ మౌతుషి సెంగుప్త సీనియర్ అడ్వైసర్ అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ (ఏ వి పి ఎన్) మరియు వారి కొలీగ్ మిస్ గీత గోల్ వారితో కలిసి మిస్టర్ షేక్ అన్వర్ విజిట్ చేయడం జరిగింది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ బృందం ముందుగా జంగాలపల్లి లో ప్రకృతి వ్యవసాయ 9 ( సార్వత్రిక) సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ మరియు ఇన్పుట్ డెమోనస్ట్రేషన్ చూడడం జరిగింది. అనంతరం జెన్నీ శాంతకుమారి అనే రైతు పొలంలో వెజిటేబుల్ ఏ గ్రేడ్ మోడల్ పరిశీలించి సైన్స్ బిహైండ్ నాచురల్ ఫామింగ్ మరియు ఏటీఎం మోడల్ నుంచి వచ్చే ఆదాయం మరియు భూమిలో వానపాముల శాతం మరియు ప్రకృతి వ్యవసాయం మరియు సేంద్రీయ వ్యవసాయ%శీ% పోల్చి పరిశీలించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయ భూమి సారవంతంగా, పంట జీవంతో నిండినట్లు కనిపించగా, రసాయన క్షేత్రాలలో పంట ఆరోగ్యకరంగా లేనట్లు గమనించారు. తదుపరి బృందం జంగాలపల్లి వివో నెంబర్లు మరియు సైన్స్ టీం తో ఇంటరాక్షన్ జరిగింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రకృతి వ్యవసాయ రైతులు సాగు చేస్తున్న మోడల్స్ మరియు ఘన ద్రవ జీవామృతాలు ఉపయోగాలు, భూమిలో వానపాముల అభివృద్ధి, వేర్లు పొడవు గురించి తెలియజేయడం జరిగింది.

# రాష్ట్రంలో కొత్తగా ఏడు డయాలసిస్ కేంద్రాలు

**అమరావతి, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం (పీఎంఎన్‌డీపీ) కింద రాష్ట్రంలోని కిడ్నీ బాధితుల కోసం కొత్తగా ఏడు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట, చిత్తూరు జిల్లాలోని పీలేరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి వైద్యశాలల్లో ఇవి అందుబాటులోకి వస్తాయని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పీపీపీ విధానంలో వీటిని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఒక్కో కేంద్రంలో 5 చొప్పున రక్తశుద్ధి యంత్రాలు, ప్రతి కేంద్రానికి అనుబంధంగా ఆర్వో ప్లాంటు ఏర్పాటవుతాయని తెలిపారు.

# శ్రీరాముని ఔదార్యం ప్రపంచానికి ఆదర్శం





- తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి
- తూడిచెర్లలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**నంద్యాల, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

శ్రీరాముని ఔదార్యం యావత్ ప్రపంచానికి ఆదర్శమని, శ్రీరాముడు చూపించిన కరుణ, దాతృత్వం, క్షమాగుణం, అసూయ లేనితనం, సకల ప్రాణుల హితాన్నికోరే గుణం, మానవులపైనే కాక పశుపక్షాదులపై దయ కలిగి ఉండడం, ఇతరులు చేసిన ఉపకారాన్ని గుర్తించడం మొదలైన గుణాలు మానవజాతి మనుగడకు అవసరమైన గుణాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, జూపాడుబంగ్లా మండలం, తూడిచెర్ల గ్రామంలోని శ్రీ రామాలయం నందు ఐదు రోజుల ధార్మిక కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రారంభో ఉపన్యాసం చేశారు. తదనంతరం స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, ధర్మప్రచారకులు జయదేవానంద స్వామి శ్రీమద్రామాయణంపై చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించినది.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండు బాల మద్దిలేటి, పారిశ్రామికవేత్త బి.పద్మనాభయ్య, తితిదే ధర్మ ప్రచార మండలి సభ్యులు పి. రామచంద్రుడు, డి. సుధాకర్, ఎన్. రాముడు, బాలకృష్ణ, ఉప సర్పంచ్ కె.చెన్నారెడ్డి, కెగోపాల్ రెడ్డి, డి. చిన్న నరసిహులు, కుమ్మరి మధు తోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమావాస్య కావడం వల్ల భక్తాదులందరికి భక్ష భోజనాలు ఏర్పాటు చేశారు.

## పర్యాటకులకు స్నేహపూర్వకమైన వాతావరణంలో

# బీచ్‌లు ఉండేలా అభివృద్ధి చేయాలి

- బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



**బాపట్ల, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

పర్యాటకులకు స్నేహపూర్వకమైన వాతావరణంలో బీచ్ లు ఉండేలా అభివృద్ధి చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే అంశంపై సంబంధితశాఖల అధికారుల వీక్షణ సమావేశంలో మేఘో మథనం కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. బాపట్ల జిల్లా పర్యాటక రంగానికి చాలా కీలకమైనదిగా ఉందని కలెక్టర్ చెప్పారు. ఆరు మండలాలలో సముద్ర తీర ప్రాంతం ఉందన్నారు. సముద్ర తీర ప్రాంతాలైన 17 పంచాయతీలలో బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఎనిమిది పంచాయతీ పరిధిలో తొమ్మిది బీచ్ లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధించాలని ఆదేశించారు. ఆ మేరకు సదరు పంచాయతీ సమావేశాలలో తీర్మానం చేయాలన్నారు. బీచ్ లు కొనసాగే పంచాయతీలలో ఆర్థిక వనరులు పెరగడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బీచ్ లను అపరిశుభ్రం చేస్తే జరిమానాలు విధించాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తే జరిమానా, దుకాణాల వద్ద చెత్త వేసినా, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగించినా జరిమానా విధించాలన్నారు. రిసార్ట్స్ వద్ద వేడుకలు జరిగితే పరిశుభ్రత బాధ్యత వారిదేనన్నారు. ఏదైనా కార్యక్రమాలు రిసార్ట్స్ వెలుపల నిర్వహిస్తే నామమాత్రం రుసుము చెల్లించే విధానం ప్రవేశపెట్టాలన్నారు. దుకాణాలకు, వాహనాల పార్కింగ్ కు ధరలు నిర్ణయిస్తూ పంచాయతీలలో తీర్మానం చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వసూలు చేసే నగదును బీచ్ ల పరిశుభ్రతకు వినియోగించాలన్నారు. చేసిన తీర్మానాలు పక్కాగా అమలు చేయడానికి ఎన్ఫోర్స్మెంట్ బృందాలు ఉండాలన్నారు. ప్రతిరోజు బీచ్ ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బీచ్ రహదారిలో అధికంగా చెత్త కుండీలు ఏర్పాటు చేయాని కలెక్టర్ తెలిపారు. బీచ్ లు పరిశుభ్రంగా ఉంచుకుంటే పర్యాటకులు సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. ఆహ్లాద వాతావరణంలో బీచ్ లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో బీచ్ లు ఉండేలా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతివారం బీచ్లను సందర్శి స్తామన్నారు. పర్యాటకులు సందర్శించే ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉంటే ఉపేక్షించేది లేదని, వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. పంచాయితీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో ఆ ప్రాంతాలలలో మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ ప్రభాకర్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంత రాజు, డి ఎల్ డి వో లు, ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శిలు, తదితరులు పాల్గొన్నారు.

# కీలక ప్రగతి సూచికల్లో ప్రతి శాఖా ఏ గ్రేడ్ సాధించాలి

- ఐటీఐ విద్యార్థులకు యాడ్ ఆన్ కోర్సుగా కృత్రిమ మేధ (ఏఐ) నేర్పించాలి
- నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక దేశంలోనే వినూత్న ఆలోచన
- కీలక ప్రగతి సూచికల (కె.పి.ఐ), నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళికలపై సమీక్షా సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**

కీలక ప్రగతి సూచిక(కే పి ఐ) ల లో జిల్లా ర్యాంకు ముందంజలో ఉండాలంటే ప్రతి శాఖా ఉత్తమ పనితీరు కనబరచాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కీలక ప్రగతి సూచికల (కే పి ఐ) ల పై కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... కొన్ని శాఖలు బి,సి గ్రేడులలో ఉన్నాయని దీనివలన జిల్లా ర్యాంకు ప్రభావితం అవుతోందని చెప్పారు. కే పి ఐ లలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి ప్రతి శాఖ తప్పనిసరిగా ఏ గ్రేడ్ సాధించాలన్నారు. అన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈ హెచ్ ఆర్) నిర్వహించాలని చెప్పారు. ప్రతి చిన్నారి అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలని చెప్పారు. పట్టణ ప్రాంతాలలో ఇంటి నుంచి చెత్త సేకరణ 100% జరగాలని చెప్పారు. ఐటిఐ విద్యార్థులకు యాడ్ ఆన్ కోర్సుగా కృత్రిమ మేధ(ఏఐ) నేర్పించాలని ఆదేశించారు. జిల్లా విపత్తు తగ్గింపు వ్యూహాన్ని అన్నిచోట్ల అమలు చేయాలని చెప్పారు. ఉన్నత విద్య, ఇంధన శాఖలు ఏం గ్రేడు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక దేశంలోనే వినూత్నమైనదని చెప్పారు. యంగ్ ప్రొఫెషనల్స్, ప్రత్యేక అధికారులతో నియోజకవర్గాల వారీగా బృందాలు ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, ఈ లక్ష్యాలు నెరవేరేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక పై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని చెప్పారు. ప్రతి నెలలో ఒకసారి తప్పనిసరిగా స్థానిక శాసన సభ్యునితో ఈ బృందం సమావేశమై లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి వై. శ్రీలత, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ విజన్ కార్యాచరణ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన

# ఆకాశదీపం పూజా కార్యక్రమం

**పెడన, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్)**



పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కృష్ణాజిల్లా, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘంలిఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రమునందు శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు గారి నేతృత్వంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి సత్య నారాయణ (చిన్నా), మంజులత దంపతులచే ఆకాశ దీపం పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి మాట్లాడుతూ శ్రీ వాసవీ క్షేత్రంలో కార్తీక మాసం నెల రోజులు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఆకాశదీపం పూజా కార్య క్రమం నిర్వహిస్తామని కావున ఈ కార్యక్రమంలో భక్తులందరూ విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని డా. కొల్లూరి భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పట్టణ కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన శ్రీ వాసవి మహిళా మండలి కార్యవర్గ సభ్యులు ఓం నమశ్శివాయ అన్నపూర్ణాష్టకం లింగాష్టకం అత్యంత భక్తిశ్రద్ధలతో చదివారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు కార్యదర్శి జవ్వాజి నాగు సభ్యులు కొల్లిపర నాగార్జున కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయ దుర్గ కార్యవర్గ సభ్యులు జల్లూరి గంగాభవాని జల్లూరి శిరీష పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి గౌరవ సలహాదారులు కొల్లూరి మంజులత కోశాధికారి పొన్నూరు అపర్ణ కార్యవర్గ సభ్యులు కోడూరు మణి సభ్యులు కొల్లిపర అలేఖ్య పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్‌దే

## షిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో 50 వేల మెజారిటీతో కాంగ్రెస్ గెలవబోతున్నది షిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుసాయికుమార్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం అవినీతి, కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ తదితర చిట్టా సిద్ధం చేసుకోవాలని, భవిష్యత్తులో కెటిఆర్ గెస్ట్‌హౌస్‌కు పరిమితం అవుతాడన్నారు. సిరిసిల్లలో వచ్చే ఎన్నికల్లో మీరు గెలవండి చూద్దామన్నారు. గత ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను ప్రజలు 100 అడుగుల లోతు బొంద పెట్టింది మర్చిపోయరా అంటూ గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్ రెడ్డి మీద పొద్దున లేవగానే విమర్శలు చేస్తున్నారని, కెటిఆర్, బిఆర్‌ఎస్ నేతలంతా అహంకారంతో రెచ్చిపోతున్నారన్నారు. గతంలో దోచుకున్న డబ్బు ఉందనే ధైర్యంతో అహంకారంతో రెచ్చిపోయి మాట్లాడుతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు సిఎం రేవంత్ రెడ్డి మీద తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని అన్నారు.

అక్రమ సంపాదనతో లక్ష కోట్లతో సోషల్ మీడియాలో తప్పుడు పోస్టలతో ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నం చేస్తు న్నా రని, బిఆర్‌ఎస్ పార్టీని అక్రమ చిట్టా విప్పి ఇంకా బొందపెట్టే ముహూర్తం పెట్టామన్నారు. ఎవరె వరు ఏమీ చేస్తున్నారో అందరి చిట్టా సిద్ధం చేశామని, అవసరమైనప్పుడు బయటకు తీసి బిఆర్‌ఎస్ నేతల భరతం పడతామన్నారు.

# ఓటర్లను ఇంటింటికి వెళ్లి కలుస్తాం

## పెద్ద సభలు, ర్యాలీలు ఉండవు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




మంగళవారం నామినేషన్ దాఖలు చేస్తున్న బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కుటుంబ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటై రాజకీయాలు చేస్తున్నాయన్నారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు ఈటెల రాజేందర్, రఘునందర్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అంటే ఎంతో అభివృద్ధి చెందిన ధనవంతులు ఉండే ప్రాంతమని అనుకుంటాం, రోడ్లు బాగుంటాయని భావిస్తాం, కాని ఎక్కడ చూసినా చెత్త, మురుగు నీరు ఉంటుంది, సరైన రోడ్లు, వీధిదీపాలు ఉండవు, హైదరాబాద్‌ను లండన్, వాషింగ్‌టన్, సింగపూర్ చేస్తానని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఫాంహౌజ్‌లో ఉన్నారు. ఇక్కడ ప్రజలకు డ్రైనేజీ ఇతర సమస్యలు మిగిలాయని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామినిచ్చింది. ఉద్యోగాలు ఎక్కడ? కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ కార్యాలయం దారుసలాంలో నిర్ణయించారు. కాంగ్రెస్ అభ్యర్థి మజ్లిస్ నేతల ఆశీస్సులు తీసుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి పక్కన మజ్లిస్ చేరి ప్రజలపై పెత్తనం చేస్తుందన్నారు. అందుకే ఆ మూడు పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గురువారం నుంచి అధికారికంగా తాము ప్రచారాన్ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కలిసి ఓటు అభ్యర్థిస్తామని ఆయన స్పష్టం చేశారు. భారీ సభలు, ర్యాలీలు ఉండబోవని ఆయన స్పష్టం చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ఈ 20 రోజులు కార్యకర్తలంతా ప్రతి ఇంటికి వెళ్లి దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలన్నా, దోపిడి రాజ్యం అంతం కావాలన్నా బీజేపీని గెలిపించాలని ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మల్కా కొమురయ్య, ఏవీఎన్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

**భారీ ర్యాలీ:** యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలోని విజయదుర్గ పోచమ్మ దేవాలయంలో దీపక్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి, రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అక్కడి నుంచి ర్యాలీని ప్రారంభించి డప్పు నృత్యాలు, కళాకారుల మధ్య కృష్ణానగర్ ప్రధాన రహదారి, యూసుఫ్‌గూడ చెక్‌పోస్టుల మీదుగా బంజారా హిల్స్‌లోని ఎమ్మార్వో కార్యాలయంలో ఉన్న ఎన్నికల నామినేషన్ కేంద్రానికి ర్యాలీ కొనసాగింది. యూసుఫ్‌గూడ బస్తీలో క్రేన్ సాయంతో భారీ పూలదండను ఏర్పాటుచేసి లంకల దీపక్‌రెడ్డికి స్వాగతం పలికారు.



బస్తీ దవాఖానాలో వైద్యురాలు నవ్య వద్ద వివరాలు తీసుకుంటున్న కెటిఆర్

# ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్

## బస్తీ దవాఖానా పర్యటనలో కెటిఆర్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ పార్టీ ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. బంజారాహిల్స్ గురుబ్రహ్మ నగర్‌లోని బస్తీ దవాఖానాను మంగళవారం ఆయన మాజీ ఉపముఖ్యమంత్రి రాజయ్య, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, జేజోల్ల రాజు ముదిరాజ్, బసవగౌడ్, నాగరాజు, శ్రీను, చందు, శ్రీధర్ యాదవ్, జెట్టి విజయ్‌కుమార్ తదితరులతో కలిసి పరిశీలించారు. అక్కడున్న వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొవిడ్ వచ్చినప్పుడు పట్టణంలో ఉండే పేదలకు విస్తృతస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో 450 బస్తీ దవాఖానాలను, వైద్య పరీక్షల కోసం 33 జిల్లాలో టీ-డయాగ్నిస్టిక్స్ కేంద్రాలను ఏర్పాటుచేశారన్నారు. 108 రకాల మందులను ఉచితంగా అందు బాటులో ఉంచామన్నారు. ఈ రెండేళ్లలో మున్సిపల్ శాఖకు మంత్రి లేరని, హైదరాబాద్ నగరం చెత్తాచెదారంతో నిండిపోయిందని, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించే టీ-డ యాగ్నిస్టిక్ కేంద్రాలను పక్కన పెట్టారన్నారు. బస్తీ దవాఖానాల వైద్యులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. తమ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఆరోగ్యశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య నేతృత్వంలో ఎమ్మెల్యే సంజయ్, డాక్టర్ మెతుకు ఆనంద్‌లతో సబ్ కమిటీ వేసి రాష్ట్రంలో ఉన్న ఆరోగ్య, ఆసుపత్రుల పరిస్థితిపై నివేదికను రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయా, టీచర్లకు జీతాలు పెంచుతామని హామినిచ్చి ఇవ్వలేదని అన్నారు.

**పార్టీ తెలియదు.. స్టార్ క్యాంపెయినర్:** ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై కేటీఆర్ విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిదానం ఏ పార్టీలో ఉన్నారో అందరికీ తెలుసు,కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ జాబితాలో దానం పేరును చేర్చడంసిగ్గుచేటు. పార్టీ మారలేదంటూ స్పీకర్ వద్ద అబద్ధాలు చెబుతున్నారంటూ వ్యాఖ్యానించారు. ఏ పార్టీనో చెప్పుకోలేని ధైర్యం లేదన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పరిశీలకులుగా ముగ్గురు ఐఎఎస్‌లు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) ముగ్గురు ఐఎఎస్‌లను పరిశీలకులుగా నియమించింది. ఎలాంటి అవకతవకలు జరగకుండా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారులను పరిశీలకులుగా నియమించింది. సాధారణ పరిశీలకులుగా ఐఎఎస్ అధికారి రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులుగా ఓం ప్రకాశ్ త్రిపాఠి, అభ్యర్థుల ఖర్చుకు సంబంధించిన పరిశీలకులుగా సంజీవ్ కుమార్ లాల్‌లను నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఎన్నికలు పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల నిబంధనల అమలు, శాంతిభద్రతలు, ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ అంశాలను దగ్గరగా పరిశీలిస్తారు. ఎలాంటి ఉల్లంఘనలను గుర్తించినా ఆయా అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# కాంట్రాక్టులు, కమీషన్లపై బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదం




మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మాఫియా, డాన్లు, కాంట్రాక్టులు, కమిషన్ల గురించి బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్లాక్ మెయిలింగ్ చేయడంలో దిట్ట అయిన బాల్క సుమన్, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మంత్రుల గురించి మాట్లాడే ముందు కెసిఆర్ పదేళ్ల పాలనపై ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో గురుకులాల పరిస్థితిని, ప్రస్తుతం గురుకులాల్లో పరిస్థితులను బేరీజు వేసుకుంటే బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం కాంగ్రెస్ ఎంత ప్రాధాన్యతి స్తుందో స్పష్టమవుతుందన్నారు. కెసిఆర్ హయాంలో గురుకులాలు అస్తవ్యస్తంగా ఉన్నా నోరు ఎత్తని ప్రవీణ్ కుమార్ ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. కొందరు గురుకులాల విద్యార్థుల ను, వారి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి సొంత సైన్యాన్ని నిర్మించుకొని ప్రవీణ్ కుమార్ చేసిన అరాచకాలు బహిరంగ రహస్యమే అన్నారు. తాను ఐపిఎస్ అధికారి అని చెప్పుకునే ప్రవీణ్ కుమార్ తెలంగాణలో సంచలనం రేపిన నేరెళ్ల సంఘటనపై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. అప్పుడు బిఆర్‌ఎస్ నేతలను కెసిఆర్ ప్రభుత్వం కాపాడుతుంటే దళితులకు న్యాయం కోసం ప్రవీణ్ కుమార్ ఎందుకు ముందుకు రాలేదన్నారు. ఉద్యమం పేరుతో యువతను, విద్యార్థులను రెచ్చగొట్టిన బాల్క సుమన్ బిఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించారే కానీ, యువత కోసం ఎప్పుడు పోరాడలేదని, బిఆర్‌ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు లేకుండా యువత ఉద్యమిస్తుంటే యువనేతగా చెప్పుకునే సుమన్ ఎక్కడ దాక్కున్నారంటూ ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబంతో సన్నిహితంగా మెలిగే బాల్క సుమన్ వారి అండతో చేసిన అరాచకాలపై చర్చకు సిద్దమా అన్నారు. శాంతి భద్రతల గురించి మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్ బిఆర్‌ఎస్ హయాంలో కెసిఆర్ కుటుంబం చేసిన ఫోన్ ట్యాపింగ్, దౌర్జన్యాల గురించి చర్చకు ముందుకొస్తారా? సొంత కుటుంబ సభ్యులను, మంత్రుల ఫోన్ ట్యాపింగ్ చేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కెటిఆర్ గురించి ప్రవీణ్ కుమార్ ముందుగా మాట్లాడితే మంచిదన్నారు. సొంత మంత్రులపైనే నిఘా పెట్టి బ్లాక్ మెయిలింగ్ చేసిన కెసిఆర్ కుటుంబానికి దాసోహమైన ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ లకు కాంగ్రెస్ మంత్రులపై మాట్లాడే హక్కే లేదన్నారు. సోషల్ మీడియాలో కెసిఆర్ ప్రభుత్వం అరాచకాలను ప్రశ్నించిన వారిని వేధించిన ఘటనలను ప్రవీణ్ కుమార్ మర్చిపోయారని, గ్రేటర్ చుట్టు పక్కల భకబ్జాలకు పెట్టింది పేరు కెటిఆర్ అండ్ కంపెనీ కాదాఅని ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబ సభ్యుల బెదిరింపులకు,అరాచకాలకు బెదిరి ఎన్నో కంపెనీలు పక్క రాష్ట్రాలకు వెళ్లిన సంగతి వీరికి తెలియదా?రైతులకు బేడీలువేసిన మీరు రైతుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హరీష్ రావుకి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు.సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా?హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపైప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా?మా తల్లి తండ్రులపై ప్రమాణంచేసి నేను ప్రమాణం చేస్తాను అన్నారు. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను, క్యాబినెట్ సమావేశంలో వ్యక్తి గత అంశాలు చర్చ చేయలేదని నేను ప్రమాణం చేస్తాను అన్నారు. హరీష్ ఆరోపించిన విషయా లను నిజమని ప్రమాణం చేయగలవా? అన్నారు. హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పరిపాలనకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలి

## ఎఎస్‌డబ్ల్యూవోలుగా నియమితులైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని, సీఎం అవలంబిస్తున్న ఫ్రెండ్లీ గవర్నమెంట్ పరిపాలనకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. గ్రూప్-2 పరీక్షల్లో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులు(ఏఎస్‌డబ్ల్యూవో)గా నియమితులైన అభ్యర్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని ఎస్సీ డెవలప్మెంట్ అభివృద్ధి శాఖ మంత్రి కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకుంటున్న ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల సంక్షేమ కోసం క్రమశిక్షణతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి శ్రమిస్తే మీరు ఈ స్థాయికి వచ్చారని, మంచి పాలన అందించి ప్రభుత్వానికి, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మంచి చదువుని ఇచ్చి, మంచి భవిష్యత్తును ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంత్రి లక్ష్మణ్ కుమార్ చొరవతో గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం (బిఏఎస్) పథకానికి సంబంధించిన 25 శాతం నిధులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇప్పించారని అభినందించారు. హాస్టల్ విద్యార్థులకు 40 శాతం చార్జీలను 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని, సహకరించిన మల్లు భట్టి విక్రమార్కకు, మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఏఎస్‌డబ్ల్యూఓ అధికారులకు అభినందనలు తెలిపారు. ఎస్సీడిడి సెక్రెటరీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ఏఎస్డబ్ల్యూఓ అధికారులుగా నియమితులైన వారందరూ వృత్తిరీత్యా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, హాస్టల్ విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని, ఇంతటితో ఆగకుండా గ్రూపు-1 అధికారులుగా రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎస్సీడిడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి గోష్, ఎస్ సి డి డి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# సిఎం ప్రజావాణికి 62 దరఖాస్తులు



**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 22(జర్నలిస్ట్ ఫైల్):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 62దరఖాస్తులు అందాయి. దీపావళి వేడుకలు ఉన్నా ప్రజలు సీఎం ప్రజావాణీకి వచ్చారు. వచ్చిన దరఖాస్తులలో పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 18 దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 10దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 14దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణీకి 02దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 18 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి ,స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దర ఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సం బంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# దీపావళి వేడుకల్లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, చిత్రంలో తొలుపునూరి కృష్ణగౌడ్, నాగభూషణం తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** చీకటిని తరిమికొట్టేందుకు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి చిహ్నంగా ప్రజలు తమ ఇళ్ల వెలుపల మట్టి దీపాలను (దియాలు) వరుసలుగా వెలిగిస్తారని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆపార్టీ సీనియర్ నాయకులతో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్, గుర్రం శంకర్, శ్రీకాంత్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై విజయం సాధించిన సందర్భంగా దీపావళి జరుపు కోవడం జరుగు తుందని దీపావళి ప్రతి కుటుంబాలలో వెలుగులు నింపాలని మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షి ంచారు.

# గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రత్యేక పూజలు

## చార్మినార్ పరిసర ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో దీపావళీ మహా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కుటుంబ సభ్యులతో కలిసి చార్మినార్ శ్రీ భాగ్య లక్ష్మీ మందిరాన్ని సందర్శించారు. గవర్నర్‌కు మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు.గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పాతబస్తీకి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ విచ్చేసిన సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు చార్మినార్ ప్రాంతాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్. కె.లక్ష్మణ్,మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు టి.హారీష్‌రావు,తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్,జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీ,మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్,మాజీ ఎమ్మె ల్యే తీగల క్రిష్టారెడ్డి,చింతల రామచంద్రరెడ్డి,రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్. రామచందర్‌రావు,హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ మాజీ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్ తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు జరిపారు.



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కుటుంబ సభ్యులు

# పేదబ్రాహ్మణ విదేశీవిద్య పథకానికి ప్రభుత్వం 21కోట్లు విడుదల

**హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ బ్రాహ్మణసంక్షేమ పరిషత్తు వివేకానంద ఓవర్సీస్ విద్యాపథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం 21కోట్ల నిధులు విడుదల చేయడంతోపాటు వారివారి ఖాతాల్లో జమ అయినట్లు తెలపడంపట్ల తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు పూర్వాధ్యక్షుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా.కె.వి.రమణాచారి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత రెండేళ్లుగా ఈ పథకం కింద విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తున్న వందలాదిమంది విద్యార్థులు సకాలంలో ప్రభుత్వ సహాయం అందక విలవిలలాడుతున్న పరిస్థితుల్లో దీపావళి వారి జీవితాల్లో కాంతులు నింపిందన్నారు.

# రామ్మూర్తిగౌడ్‌ను పరామర్శించిన ఎంపి కృష్ణయ్య

**హైదరాబాద్ అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ ఉద్యమా నేత, బిసి సంక్షేమ సంఘం విద్యార్థి నేత అనంతుల రామ్మూర్తిగౌడ్‌ను బిసి జెఎసి చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పరామర్శించారు. బిసి బంద్ సందర్భంగా పోలీసుల అరెస్టు అనంతరం అనారోగ్యానికి గురైన, ఆయన శిష్యుడిగా ఎదిగిన రామ్మూర్తిగౌడ్‌ను కృష్ణయ్య పరామర్శించి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు బిసి రిజర్వేషన్లు, ఉద్యమ నేపథ్య వ్యూహ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి, బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగేందర్ గౌడ్, న్యూలిబరేషన్ కేంద్ర కార్యదర్శి బోర సుభాష్, ఎంబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బడే సాహెబ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ గౌడ సంఘం నాయకులు గౌని వీరస్వామిగౌడ్, నరసింహాగౌడ్, శ్రవణ్‌కుమార్‌గౌడ్, నరేందర్‌గౌడ్, బిజెపి ఎస్సీ మోర్చా రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు రమేష్, కాంగ్రెస్‌పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి శంకర్,ఈశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సంఘం నాయకులు అనంతుల గోపాల్ గౌడ్,బొరురమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# నిజమైన హిందువులు బిసిలు

## టిపిసిసి ప్రధాన కార్యదర్శిగజ్జల కాంతం

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత్‌లో నిజమైన హిందువుల బిసిలేనని, అలాంటి బిసిలను బిజెపి మోసం చేస్తుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బిసి రిజర్వేషన్ మద్దతు ఇవ్వము అని మాట్లాడారని, అంటే బిజెపి కేంద్ర నాయకత్వం బిసి రిజర్వేషన్ కానివ్వదన్న స్పష్టంగా తెలిసిపోతుందన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ అలా ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. ఉగ్రవాదుల కంటే ప్రమాదం అయినవాళ్ళు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వాళ్లు అన్నారు. వాళ్ళని నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ హిందువుల ముసుగులో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి దుర్మార్గులని బిసిలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కిషన్ రెడ్డి, రామచంద్ర రావు, బండి సంజయ్ బంద్‌లో పాల్గొన లేదన్నారు. వాళ్ళకి తోడు దొంగలు కెటిఆర్ హరీష్ రావులు అన్నారు. 42శాతం రిజర్వే షన్ ఇవ్వటం బిఆర్‌ఎస్‌కి ఇష్టం లేదు తప్పని సారి పరిస్థితిలో వారు అసెంబ్లీలో సపోర్ట్ చేశారన్నారు.

# అతి వేగానికి బాలుడు బలి

## గుండెలవిసేలా రోదించిన తండ్రి



జోయల్(ఫైల్)

**నార్సింగి, అక్టోబరు 22 (జర్నలిస్ట్‌ఫైల్) :** కారు డ్రైవర్ అతి వేగానికి రెండేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి ప్రాంతానికి చెందిన నవీన్ కుమార్ తన రెండేళ్ల కుమారుడు జోయల్‌ను వెంట తీసుకెళ్లి దీపావళి షాపింగ్ చేసుకొని, తిరిగి వస్తుండగా మణికొండలోని అల్కాపూర్‌టౌన్‌షిప్‌లో వెనుక నుంచి వేగంగా దూసుకు వచ్చిన కారు వీరి ద్విచక్రవాహనంను ఢీకొంది. ఈ సంఘటనలో తండ్రి, కుమారుడు ఇద్దరు ఎగిరి కింద పడ్డారు. రెండేళ్ల కుమారుడికి తీవ్ర రక్తస్రావం అవడంతో వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కన్నుమూశాడు. కన్న కొడుకు తన చేతుల్లోనే కన్నుమూయడంతో ఆ తండ్రి హృదయం ముక్కలైంది. అప్పుడే నీకు నూరేళ్ల నిండాయా బిడ్డా అంటూ ఆ తండ్రి గుండెలు అవిసేలా రోధించాడు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రవీణ్‌గా గుర్తించి, అతడిని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలుడి తండ్రి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# ఎపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యకి మంత్రి పొన్నం శుభాకాంక్షలు

## విద్యార్థి రాజకీయాల్లో కలిసి పనిచేశాం

**హైదరాబాద్, అక్టోబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఈశ్వరయ్యకి తెలంగాణ బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మిత్రుడు గుజ్జుల ఈశ్వరయ్యకి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి రాజకీయాల రోజుల్లో అనేక ఉద్యమాలలో కలిసి పనిచేయడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి బాధ్యతల్లో కూడా అదే ఆత్మవిశ్వాసం, అదే ఉత్సాహంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, సామాజిక న్యాయం, సమానత్వం, వర్గహి తమైన శ్రేయస్కర కార్యక్రమాల కోసం అవిశ్రాం తంగా కృషి చేస్తారని కోరుకుంటున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి ..

## దేశప్రజలకు ప్రధాని మోడీ లేఖ!



**న్యూఢిల్లీ, అక్టోబరు 22 :** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలను ఉద్దేశిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే ఇందుకు ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి.మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం. దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు.

# వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు

## - బీహార్ సీఎం నితీశ్‌కుమార్ హామీ



**పాట్నా, అక్టోబరు 22 :** బీహార్‌లో మళ్లీ ఎన్‌డియే విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అధికారంలోకి వచ్చిన వెంటనే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. మంగళవారం ముజఫర్‌పూర్ జిల్లాలోని మినాపూర్‌లో ఎన్నికల బహిరంగ సభలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ, రానున్న ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీనిచ్చారు. 50 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మొత్తంగా వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాల కల్పిస్తామని నితీశ్ కుమార్ పునరుద్ఘాటించారు. ఇరవై ఏళ్లుగా తమ ప్రభుత్వం నిరంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశాం. విద్య నుంచి శాంతిభద్రతల వరకు ఎంతో చేశాం. తాము అందరికోసం పనిచేశాం. ఇప్పుడు ఆ ఆటవిక పాలన నుంచి పూర్తిగా స్వేచ్ఛగా బయటపడ్డాం. రాష్ట్రంలో ప్రేమ, సోదరభావం, శాంతి వాతావరణం నెలకొంది. ఇది తమ ప్రభుత్వం ఘనత అని చెప్పుకొచ్చారు. లాలూప్రసాద్ అధికారంలో ఉన్నప్పుడు మహిళల కోసం ఏమీ చేయలేదని, దాణా కుంభకోణంలో చార్జిషీట్ ఆయన పదవి నుంచి తప్పుకునేలా చేసినప్పుడు భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రిని చేశారని విమర్శలు గుపినపంచారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, ఇందులో భాగంగా పెద్ద ఎత్తున స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకాన్ని ప్రారంభించి ఇటీవల ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున కోటి మందికి పైగా లబ్ధిదారుల ఖాతాల్లోకి బదిలీ చేశామని వివరించారు.

### మహాకూటమిలో కుదరని సీట్ల సర్దుబాటు

#### - స్నేహపూర్వక పోటీ పేరుతో బరిలోకి

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మహాఘట్ బంధన్‌లో సీట్ల సర్దుబాటు కుదరలేదు. ఎవరికి వారు అన్నట్లు ఆయా పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. నామినేషన్లు వేయించారు. దీంతో కూటమిలోని పార్టీల మధ్యే పోటీ నెలకొంది. దాదాపు 20 స్థానాల్లో స్నేహపూర్వక పోటీ చేస్తున్నట్లు ఇటు ఆర్‌జెడి, అటు కాంగ్రెస్ ప్రకటించాయి. ఇక సీట్ల సర్దుబాటుకు సంబంధించి అధికారిక ప్రకటన ప్రకారం, ఆర్‌జెడి 143 స్థానాల్లో పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ 61, సిపిఐఎంఎల్ 20, వీఐపి 15, సిపిఐ 6, సిపిఐ(ఎం) 4 స్థానాల్లో బరిలో నిలిచాయి. ఐదు స్థానాల్లో ఆర్‌జెడి స్నేహ పూర్వక పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ 12 సీట్లలో, వామపక్ష పార్టీలు కూడా ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేస్తు న్నాయి. వీఐపి కూడా ఏడు నియోజక వర్గాలలో కాంగ్రెస్, ఆర్‌జెడి అభ్యర్థులతో స్నేహపూర్వక పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్‌ల మధ్య భేదాభిప్రాయాలతోనే ఈ సమస్య నెలకొందని ఆయా పార్టీల నేతలు పెదవి విరుస్తున్నారు. స్నేహపూర్వక పోటీతో ప్రత్యర్థి ఎన్‌డియే కూటమికి లబ్ధి చేకూరుతుందని కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

#### బరిలో నుంచి జెఎంఎం నిష్క్రమణ

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయట్లేదని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ప్రకటించింది. మహాఘట్ బంధన్ మిత్రపక్షాలు ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలు సంకీర్ణ ధర్మాన్ని నిలబెట్టడంలో విఫలమయ్యాయని జెఎంఎం సీనియర్ నాయకుడు సుదీప్ కుమార్ సోను ఆరోపించారు. కూటమిలోని పార్టీలను సంప్రదించ కుండా సీట్ల సర్దుబాటు చేశారని దుయ్యబట్టారు. అందుకే పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు వివరించారు. అయితే, ఏ కూటమికి జెఎంఎం మద్దతు ఇవ్వ దని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఆర్‌జెడిలతో కూడిన బీహార్‌లోని మహాఘట్ బంధన్ నుండి విడిపోయి, ఆరు స్థానాల్లో పోటీ చేస్తుందని జెఎంఎం ప్రధాన కార్యదర్శి సుప్రియో భట్టా చార్య శనివారం ప్రకటన చేసిన రెండు రోజులకే ఆ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది.

#### అలా నామినేషన్.. ఇలా అరెస్ట్

రోహ్‌తాస్ జిల్లా ససారాం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆర్‌జెడి అభ్యర్థి సతేంద్ర సాహ్ నామినేషన్ దాఖలు చేశాడు. ఇలా ఇవో కార్యాలయం నుంచి బయటికి రాగానే పోలీసులు అరెస్టు చేశారు. సాహ్‌పై నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ పెండింగ్‌లో ఉన్నందున జార్ఖండ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోహ్‌తాస్ జిల్లా ఎస్పీ కథనం ప్రకారం...

"ససారాం స్థానం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి సోమవారం సంబంధిత సర్కిల్ అధికారి కార్యాలయానికి సతేంద్ర సాహ్ చేరుకున్నాడు. అతనిపై పెండింగ్‌లో ఉన్న ఒక ఎన్‌బిడబ్ల్యూను అమలు చేయడానికి జార్ఖండ్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతను తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయడానికి అనుమతించారు. తదనంతరం అతడిని అరెస్టు చేసి జార్ఖండ్‌కు తీసుకెళ్లారు" అని వివరించారు.


# హద్దుమీరితే హమాస్‌కు తీవ్రపరిణామాలు తప్పవు

## కాల్పుల విరమణపై ట్రంప్ మరోసారి హెచ్చరిక



**వాషింగ్టన్, అక్టోబరు 22 :** గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో హద్దులు దాటితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌ను తీవ్రంగా హెచ్చరించారు. ఒప్పం దాన్ని ఉల్లంఘిస్తే హమాస్‌ను తుడిచిపెట్టేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో వైట్‌హౌస్‌లో సమావేశమైన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు రెండు వారాల క్రితం అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం పలుమార్లు ప్రమాదంలో పడింది. మృతదేహాల అప్పగింతలో హమాస్ జాప్యం చేస్తోందని, దాడులకు పాల్పడుతోందని ఇజ్రాయెల్ ఆరోపి స్తున్న నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. హమాస్‌తో మేం ఒక ఒప్పందం చేసుకున్నాం. వారు మంచిగా, ప్రశాంతంగా ఉంటారని అను కుంటున్నాం. అలా జరగకపోతే, అవసరమైతే వారిని తుడిచిపెట్టేస్తాం. ఈ విషయం వాళ్లకూ తెలుసని ట్రంప్ తెలిపారు. ప్రత్యర్థులను బహిరంగంగా ఉరితీయడం వంటి చర్యలను వెంటనే ఆపాలని కూడా ఆయన హమాస్‌ను హెచ్చరించారు. అయితే, ఈ విషయంలో అమెరికా సైన్యం నేరుగా జోక్యం చేసుకోదని ట్రంప్ స్పష్టం చేశారు. ఒకవేళ అవసరమైతే గాజాలో శాంతి స్థాపన కోసం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దళాలు రంగంలోకి దిగుతాయని ఆయన తెలిపారు. నేను కోరితే ఇజ్రాయెల్ రెండు నిమిషాల్లో రంగంలోకి దిగుతుంది. కానీ ప్రస్తుతానికి మేం వారికి ఒక అవకాశం ఇస్తున్నాం. వారు హింసను ఆపకపోతే త్వర లోనే కఠిన చర్యలు తప్పవని ఆయన వ్యాఖ్యా నించారు. మరోవైపు తాము ఒప్పందానికి కట్టుబడి ఉన్నామని హమాస్ చర్చల ప్రతినిధి ఖలీల్ అల్‌హయా తెలిపారు. మృతదేహాలను వెలికితీయడం చాలా కష్టంగా మారిందని, అయినప్పటికీ తాము తీవ్రంగా ప్రయత్నిస్తు న్నామని ఆయన ఈజిప్ట్ మీడియాకు వివరించారు. ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో అమె రికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇజ్రాయెల్ పర్యటనకు బయలుదేరారు. ఆయన ప్రధాని నెతన్యాహుతో సమావేశం కానున్నారు. అంతకుముందే ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, సలహాదారు జారెడ్ కుష్నర్ కూడా నెతన్యాహుతో భేటీ అయి, తాజా పరిణా మాలపై చర్చించారు.

## బంగీజంప్‌కోసం బ్రిటన్‌నుంచి వచ్చిన మహిళ సాహసం



**రిషీకేశ్, అక్టోబరు 22 :** ఎనభైమూడేళ్ల వృద్ధురాలు చేసిన సాహసం ఇప్పుడు సోషల్ మీడియాలో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఎలాంటి భయం లేకుండా, ఎంతో ఉత్సాహంగా ఆమె ఇండియాలోనే అత్యంత ఎత్తైన బంగీ జంప్ చేయడం అందరిలో స్ఫూర్తిని నింపుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన 83 ఏళ్ల మహిళ రిషికేశ్‌లోని శివపురిలో ఉన్న భారతదేశపు అత్యంత ఎత్తైన బంగీ జంప్ చేయడానికి ప్రత్యేకంగా ఇక్కడికి వచ్చారు. ఈ సాహసానికి సంబంధించిన వీడియోను హిమాలయన్ బంగీ అనే సంస్థ తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది. బంగీ జంప్ థ్రిల్ అనుభవించడం కోసమే 83 ఏళ్ల మహిళ యూకే నుంచి ఇక్కడికి వచ్చారు. ఇది ఆమె జీవితంలో తీసుకున్న ఉత్తమ నిర్ణయం కావచ్చని వారు ఆ పోస్టుకు వ్యాఖ్యను జోడించారు. వైరల్ అయిన వీడియోలో, ఈ వృద్ధురాలు జంప్ చేయడానికి ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ కనిపించారు. ప్లాట్‌ఫామ్ పై నుంచి దూకే సమయంలో ఆమెలో ఏమాత్రం భయం కనపడలేదు. పక్షిలా గాల్లో తేలుతూ, స్వేచ్ఛగా చేతులు కదిలిస్తూ ఆమె ఈ సాహసాన్ని పూర్తి చేశారు. నెటిజన్లు ఆమె ధైర్యాన్నిప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

# బాలీవుడ్ సీనియర్ కమెడియన్ అస్రానీ కన్నుమూత



**ముంబయి, అక్టోబరు 22 :** బాలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు గోవర్ధన్ అస్రాని కన్నుమూశారు. ఆయన వయసు 84 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అస్రానిని నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆయన నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అస్రాని మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సహచరులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1941లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జన్మించిన అస్రాని ప్రారంభంలో ఆల్ ఇండియా రేడియోలో వాయిస్ ఆర్టిస్ట్‌గా పనిచేశారు. అదే సమయంలో తన విద్యను పూర్తి చేశారు. నటనపై ఉన్న ఆసక్తితో 1962లో ముంబయికి వెళ్లారు. అక్కడ దర్శకులు కిశోర్ సాహు, హృషికేశ్ ముఖర్జీ సలహా మేరకు పుణెలోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. 1966లో విడుదలైన"హమ్ కహా జా రహే హై సినిమాతో వెండితెరపై తొలి అడుగుపెట్టిన ఆయన, 1967లో వచ్చిన"హరే కాంచ్ కీ చూడియాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే షోలే" సినిమాలో ఆయన పోషించిన జైలర్ పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చిపెట్టింది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో అస్రాని 350కిపైగా సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. హీరో హిందూస్థానీ,డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో కూడా ఆయన గుర్తుండిపోయే పాత్రలు పోషించారు.

# హెచ్ 1బి వీసా ఫీజులో ఊరట

## దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు మినహాయింపు!

**న్యూఢిల్లీ,అక్టోబరు22:**అమెరికా ఉద్యోగం కోసం కలలు కనే వారికి ఊరట. హెచ్ 1 బి వీసా ఫీజు విషయంపై ఆ దేశంలో ఇప్పటికే చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. ఈ ఫీజు చెల్లింపుల విషయంపై అమెరికా పౌరసత్వం, వలస సేవల సర్వీస్ కీలక ప్రకటన చేసింది. హెచ్1 బి వీసా కోసం పెంచిన లక్ష డాలర్ల ఫీజు దేశం బయటనుంచి వచ్చే దరఖాస్తులకు మాత్రమే వరిస్తుందని స్పష్టం చేసింది. యుఎస్‌సిఐఎస్ ప్రకటన ప్రకారం అమెరికాలో చదువుకుని, ఉద్యోగాల కోసం హెచ్1బి వీసాకు దరఖాస్తు చేసుకునే విదేశీ విద్యార్థులు లక్ష డాలర్లు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే బయట దేశాల నుంచి వచ్చే దరఖాస్తుదారులు మాత్రం ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీని ప్రకారం అమెరికాలో ఉద్యోగం చేయాల నుకునే విదేశీయులు ముందుగా కొన్నేళ్లు అక్కడ చద వాల్సి ఉంటుంది. ఇక, సెప్టెంబర్ 21న హెచ్1బి వీసాపై ప్రకటన వెలువడిన తర్వాత దాఖలైన దఖాస్తులకు మాత్రమే ఇది వరిస్తుందని తెలిపింది. ఈ ఫీజు చెల్లింపులకు ఆన్‌లైన్ ప్రారంభించినట్లు వెల్లడించింది.

# జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనాయే తకైచి

## - శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**టోక్యో,అక్టోబరు 22 :** జపాన్ రాజకీయ చరిత్రలో ఒక కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ దేశ ప్రధానమంత్రిగా ఓ మహిళ బాధ్యతలు చేపట్టారు. జపాన్ ఐరన్ లేడీగా పేరుగాంచిన సనాయే తకైచిని దేశ ప్రధానిగా పార్లమెంట్ దిగువ సభ మంగళవారం ఎన్నుకుంది. 64 ఏళ్ల సంప్రదాయవాద నాయకు రాలు, చైనాపై బహిరంగ విమర్శలకు ప్రసిద్ధి. 465 స్థానాలున్న దిగువ సభలో తకైచికి 237 ఓట్లు లభించాయని, తద్వారా ఆమె మెజారిటీ మార్కును సునాయాసంగా దాటారని దిగువ సభ సిబ్బంది తెలిపారు. ఎగువ సభ ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. జపాన్ ప్రధానమంత్రిగా సనాయే తకైచి ఎన్నికై నట్లు అధికారికంగా ప్రకటించారు. ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాజీనామా చేసిన షిగెరు ఇషిబా స్థానంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తకైచికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జమ్మూకాశ్మీర్‌లో సిఎం వదులుకున్న సీటుకు ముగ్గురు 'ఆగా'ల పోటీ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 22 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో జమ్మూకశ్మీర్‌లోని బడ్గాం నియోజకవర్గం ప్రముఖంగా వార్తల్లో నిలుస్తోంది. జమ్మూకశ్మీర్ ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ స్థానాన్ని ఖాళీచేయడం ఒక కారణమైతే ఇక్కడి నుంచి మూడు ప్రధాన పార్టీల తరఫున ముగ్గురు 'ఆగా'లు పోటీపడుతుండటం మరొకటి. ఈ ముగ్గురూ రాజకీయంగా శక్తిమంతమైన షియా వర్గానికి చెందినవారే కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. జమ్మూకశ్మీర్‌లో గత ఏడాది నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గాందర్‌బల్, బడ్గాం స్థానాల నుంచి పోటీ చేశారు. రెండు చోట్ల విజయం సాధించారు. ఈ క్రమంలోనే సిఎంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఆయన బడ్గాం సీటును వదులుకున్నారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం ఈ పార్టీ నుంచి మాజీ మంత్రి ఆగా సయ్యద్ మహమూద్ బరిలో దిగారు. ఎన్సీ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొడుతున్నారు. అయితే ఈ పార్టీ నుంచి బడ్గాం స్థానంలో గతంలో వరుసగా మూడు సార్లు విజయం సాధించి, ఇప్పుడు ఎంపిగా ఉన్న ఆగా సయ్యర్ రుహుల్లా మెహదీ మాత్రం తమ పార్టీ ప్రచారానికి నిరాకరించడం గమనార్హం. జమ్మూకశ్మీర్ మాజీ సిఎం మెహబూబా ముఫ్తీకి చెందిన పిడిపి నుంచి యువనేత ఆగా సయ్యద్ ముంతజీర్ మెహదీ పోటీ చేస్తున్నారు. ఆయన తన ప్రచారంలో సిఎం ఒమర్ అబ్దుల్లాను లక్ష్యంగా చేసుకుంటున్నారు. భారీ మెజారిటీతో గెలిస్తే ఇక్కడే ఉంటానని చెప్పి బడ్గాం ప్రజలను ఆయన మోసం చేశారని ఆరోపిస్తున్నారు. కలుషిత జలాలు, ఆరోగ్యం, రోడ్ల సమస్యలను లేవనెత్తుతున్నారు. మహమూద్, ముంతజీర్‌లు వరుసకు తాతామనవళ్లు కావడం గమనార్హం. అయితే రాజకీయాలు రాజకీయాలేనని, తాము వేర్వేరు పార్టీలకు చెందిన నేతలమని మహమూద్ స్పష్టం చేశారు. బీజెపి తరఫున ఆగా సయ్యద్ మొహ్సిన్ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతపై ఆశలు పెట్టుకున్నారు. ఎన్సీ, పిడిపిలు బడ్గాం అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తున్నారు.

# దళిత యువకుడిపై అమానుషం

## బూట్లు నాకమని బలవంతం చేసిన అగ్రవర్ణాలవారు

**హమీర్‌పూర్(యూపి), అక్టోబరు 22 :** కుల వివక్షకు సంబంధించిన అమానవీయ ఘటన ఒకటిఉత్తరప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చింది. హమీర్‌పూర్ జిల్లాలో ఒక దళిత యువకుడిపై అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు అత్యంత పాశవికంగా దాడి చేసి, అతడితో బూట్లు నాకమని బలవంతం చేశారు. ఈ దాడిలో బాధితుడి చెయ్యి విరిగింది. అయితే, ఘటన జరిగి 12 రోజులైనా స్థానిక పోలీసులు కేసు నమోదు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. చివరికి జిల్లా ఎస్పీ జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదైంది. సిమ్నోడి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఉమేష్ బాబు వర్మ అక్టోబర్ 5న మార్కెట్‌కు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. మార్గమధ్యలో అభయ్ సింగ్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి ఉమేష్‌ను అడ్డగించాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను చించివేయడంపై ఉన్న పాత గొడవను మనసులో పెట్టుకుని వారు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. నన్ను కులం పేరుతో తిడుతూ, వాళ్ల బూట్లు నాకమని బలవంతం చేశారు. ఆ తర్వాత నాపై దాడి చేసి చేయి విరగ్గొట్టారని బాధితుడు ఉమేష్ స్థానిక మీడియాకు తన ఆవేదనను వివరించాడు. దాడి తర్వాత న్యాయం కోసం స్థానిక పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. చాలాసార్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాను, కానీ నా ఫిర్యాదును ఎవరూ స్వీకరించలేదని తెలిపాడు. స్థానిక పోలీసుల నుంచి స్పందన లేకపోవడంతో ఉమేష్ నేరుగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) డాక్టర్ దీక్షా శర్మను కలిసి జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ఆమె ఆదేశాలతో పోలీసులు 12 రోజుల ఆలస్యంగా అభయ్ సింగ్, మరో ఇద్దరిపై దాడి, దళితులపై అకృత్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ఫిర్యాదును నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# చాయ్‌వాలా ఇంట్లో కోటి నగదు

## - భారీగా బంగారం, వెండి స్వాధీనం

## - 85 ఎటిఎం కార్డులు, 75 పాస్‌బుక్‌లు సీజ్


## - ఇద్దరు అరెస్టు: సైబర్ క్రైమ్ డిఎస్పీ



**పాట్నా, అక్టోబరు 22 :** బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లో ఓ చాయ్‌వాలా ఇంట్లో పోలీసులు సోదాలు చేయగా, రూ.కోటికి పైగా నగదు, భారీగా బంగారు, వెండి ఆభరణాలు, డజన్ల కొద్దీ ఎటిఎం కార్డులు, పాస్‌బుక్‌లు బయటపడ్డాయి. సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ డిఎస్పీ అవంతిక దిలీప్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... గోపాల్‌గంజ్‌లోని టీ విక్రేత ఆన్‌లైన్ మోసాల నెట్‌వర్క్ నడుపుతున్నాడు. అంతర్రాష్ట్ర సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే పక్కా సమాచారంతో సైబర్ క్రైమ్ పోలీసులు చాయ్‌వాలా ఇంట్లో తనిఖీలు చేశారు. ఈ సోదాల్లో రూ.1.05,49,850 నగదు, 344 గ్రాముల బంగారం, 1.75 కేజీల వెండి ఆభరణాలతోపాటు 85 ఎటిఎం కార్డులు, 75 బ్యాంక్ పాస్‌బుక్‌లు, 28 చెక్‌బుక్‌లు, ఆధార్ కార్డులు, రెండు ల్యాప్ టాప్‌లు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక లగ్జరీ కారు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు అభిషేక్ కుమార్ ఒకప్పుడు ఓ చిన్న టీ స్టాల్ నడిపేవాడు. తర్వాత సైబర్ క్రైమ్ రాకెట్‌లో చేరాడు. దుబాయ్‌కెళ్లి సైబర్ క్రైమ్‌కు సంబంధించి సమన్వయం చేస్తుండగా, సోదరుడు ఆదిత్యకుమార్‌ను ఇండియాలో లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. ప్రాథమిక దర్యాప్తులో ముఠా మోసపూరితంగా సంపాదించిన డబ్బును వివిధ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసి, తర్వాత దాన్ని నగదుగా మార్చిందని డిఎస్పీ అవంతిక దిలీప్‌కుమార్ వివరించారు. నెట్‌వర్క్ బీహార్ దాటి విస్త రించి ఉన్నట్లు గుర్తించామని, ఈ ముఠాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశంపై దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇద్దరినీ అదుపులోకితీసుకుని విచారిస్తున్నట్లు డిఎస్పీ తెలిపారు.

# సంక్షిప్తంగా..

## అమెరికాలో ఆస్ట్రేలియా రాయబారిపై ట్రంప్ అసహనం



**వాషింగ్టన్, అక్టోబరు 22 :** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ సమక్షంలోనే, అమెరికాలో ఆ దేశ రాయబారిగా ఉన్న కెవిన్ రడ్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అసహనాన్ని తీవ్రస్థాయిలో వ్యక్తం చేశారు. నేను నిన్ను ఇష్టపడను. బహుశా ఎప్పటికీ ఇష్టపడకపోవచ్చని ఆయన ముఖం మీదే చెప్పడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైట్‌హౌస్‌లో జలాంతర్గాముల ఒప్పందంపై చర్చించేందుకు ట్రంప్, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ సమావేశమయ్యారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరుగుతున్న సమయంలో, ఒక విలేకరి కెవిన్ రడ్‌ను ఉద్దేశించి ఒక ప్రశ్న అడిగారు. గతంలో రడ్ చేసిన విమర్శలపై మీరెలా భావిస్తున్నారని ట్రంప్‌ను ప్రశ్నించారు. ట్రంప్ స్పందిస్తూ, "ఆయనెక్కడ? ఇంకా మీ దగ్గరే పనిచేస్తున్నారా?" అని అల్బనీస్‌ను అడిగారు. ప్రధాని అల్బనీస్ ఇబ్బందిగా నవ్వుతూ ఎదురుగా కూర్చున్న రడ్‌ను చూపించారు. వెంటనే రడ్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ, అధ్యక్షా, నేను ఈ పదవి చేపట్టక ముందు చేసిన వ్యాఖ్యలవి అని చెప్పబోయారు. అయితే, అడ్డు తగిలిన ట్రంప్, నువ్వంటే నాకు ఇష్టం లేదు అని ఘాటుగా బదులిచ్చారు.

## కోటలోపల ముస్లిం నమాజ్.. గోమూత్రంతో శుద్ధిచేసిన బిజెపి కేడర్



**శనివార్‌వాడ(మహారాష్ట్ర), అక్టోబరు 22 :** మహారాష్ట్రలోని పుణెలో ఉన్న చారిత్రక శనివార్‌వాడ కోటలో చోటుచేసుకున్న పరిణా మాలు తీవ్ర రాజకీయ దుమారానికి దారి తీశాయి. కొందరు ముస్లిం మహిళలు కోట లో పల నమాజ్ చేసిన ప్రదేశాన్ని బీజేపీ ఎంపీ మేధా కులకర్ణి నేతృత్వం లోని బృందం గో మూత్రంతో శుద్ధి చేయడం పెద్ద వివాదంగా మారింది. శనివారం నాడు కొందరు ముస్లిం మహిళలు శనివార్‌వాడ ప్రాంగణంలో నమాజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, నమాజ్ చేసిన గుర్తుతెలియని మహిళలపై కేసు నమోదు చేశారు.

## జర్నలిస్టుపై నోరుపారేసుకున్న వైట్‌హౌస్ సెక్రటరీ



**వాషింగ్టన్, అక్టోబరు 22 :** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్, ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు అత్యంత వివాదాస్పద రీతిలో సమాధానమిచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరగబోయే భేటీ వేదిక గురించి ప్రశ్నించగా, మీ అమ్మే నిర్ణయించారు అంటూ ఆమె బదులివ్వడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో త్వరలో సమావేశం కానున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ భేటీకి వేదికను ఎవరు ఎంపిక చేశారని హఫింగ్‌టన్ పోస్ట్ రిపోర్టర్ ఎస్‌వీ డేట్ టెక్స్ట్ మెసేజ్‌లో ప్రశ్నించగా, లెవిట్ పైవిధంగా స్పందించారు. అనంతరం, జర్నలిస్టుతో జరిగిన సంభాషణ స్క్రీన్‌షాట్‌ను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ ఘటనపై కరోలిన్ లెవిట్ వివరణ ఇస్తూ, సదరు రిపోర్టర్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

## టేకాఫ్ అయిన కొద్దినిమిషాలకే వెనక్కి మళ్లిన విమానం

**లాస్‌ఏంజెల్స్, అక్టోబరు 22 :** అమెరికాలో ఓ విమానంలో ఊహించని పరిణామం చోటుచేసు కుంది. కాక్‌పిట్‌లోకి ఎవరో బలవంతంగా చొం బడేందుకు ప్రయత్నిస్తున్నారని పైలట్లు తీవ్రంగా ఆందోళన చెందారు. దీంతో టేకాఫ్ అయిన 40 నిమిషాలకే విమానాన్ని వెనక్కి మళ్లించి, బయలుదేరిన విమానాశ్రయంలోనే అత్య వసరంగా ల్యాండ్ చేశారు. అసలు విష యం తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్లైట్ 6469 సోమవారం ఒమాహా నుంచి లాస్ ఏంజెలెస్‌కు బయలుదేరింది. విమా నం గాల్లోకి లేచిన కాసేపటికే పైలట్లకు కాక్‌పిట్ నుంచి ఒక రకమైన స్టాటిక్ శబ్దం వినిపించింది. ఎవరో దుండగులు కాక్‌పిట్ డోర్‌ను బద్దలుకొట్టి లోపలికి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు అపార్థం చేసుకున్నారు. వెంటనే అప్రమత్తమై, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు సమాచారం అందించింది.

## మాదకద్రవ్యాల మత్తులో విచక్షణా రహితంగా దాడిచేసిన ఆ నలుగురు అరెస్ట్



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) : త్రీటౌన్ లిమిట్స్ లోని సి ఎమ్ కాలనీలో ఈనెల 20,వ తేదీ రాత్రి, ఆటో డ్రైవర్ షేక్ రెహమాన్ పైవిచక్షణా రహితంగా దాడి చేసి, హతమార్చాలని చూసిన వ్యక్తులను, బాదితుడి పిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్నట్లు త్రీ టౌన్ సి ఐ.ఎస్. సాంబశివరావు పేర్కొన్నారు. బాదితుడు షేక్ రెహమాన్ పిర్యాదు మేరకు, కేసు పూర్వపరాలను, అదుపులోకి తీసుకున్న ముద్దాయిల వివరాలను, బుధవారం సి ఐ, సాంబశివరావు మీడియా సమావేశంలో వివరించారు. ఈనెల 19,వ తేదీ మధ్యాహ్నం, రాఘవ అనె కుర్రవాడిని, షేక్ అబ్దుల్ రెహమాన్, అతని అనుచరులు గరిక నాంచారయ్య, షేక్ అరీఫ్, మువ్వా తిరుపతి అనె నలుగురు,రాఘవను ఒంటరిని చేసి కొడుతున్న, క్రమంలో ఆప్రాంతంలోనె, నివాసముండె, ఆటో డ్రైవర్ షేక్ రెహమాన్ వారిని అడ్డుకుని, రాఘవను వారి నుండి విడిపించి, దాడి చేస్తున్న,నలుగుర్ని, అంధరిలో మందలించే ప్రయత్నం చేయగా, వారు ఆటో డ్రైవర్ ను ప్రతిఘ డించారు. ఇది గమనించిన ఆటో డ్రైవర్ రెహమాన్ భార్య ఫాతిమా, రెహమాన్ పిల్లలు వచ్చి, రెహమాన్ ను ఆ గొడవ నుండి ఇంటికి తీసుకు వెళ్లారు. ఆటో డ్రైవర్ అబ్దుల్ రెహమాన్ అందరిలో అవమానించాడని, అతనిపై కక్ష పెంచుకున్న, ఆనలుగురు ఓ పధకం ప్రకారం, 20,వ తేదీ రాత్రి సమయంలో, మధ్యం సేవించిన మత్తులో,ఆటోడ్రైవర్ రెహమాన్ ఇంటికి విచక్షణా రహితంగా దాడి చేశారు. ఇది గమనించి ఆప్రాంత వాసులు ప్రతిఘడించడంతో, ఆనలుగురు అక్కడి నుండి వెళ్ళిపోయారు. అప్పటికే, వారు చేసిన దాడివల్ల,తలకు తీవ్రమైన గాయాంతో, రక్తం సిక్తమై ఉన్న, ఆటో డ్రైవర్ రెహమాన్ ను, ఆప్రాంత వాసులు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లారు. వైద్యశాలలో బాదితుడు ఇచ్చిన పిర్యాదులో, ఉదహరించిన నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచినట్లు సి ఐ, ఎస్. సాంబశివరావు మీడియాకు వివరించారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన




గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడం, ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం పెంపొందించడం లక్ష్యంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. అక్టోబర్ నెలను జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసంగా ప్రకటించి, దేశవ్యాప్తంగా పోలీస్ శాఖలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

ఈ క్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏసీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు సైబర్ నేరాల వలన కలిగే ముప్పులు, మోసాలను గుర్తించే పద్ధతులు, సురక్షితమైన డిజిటల్ వినియోగం గురించి పోలీసులు వివరించారు.

పోలీసులు ప్రజలకు ముఖ్య సూచనలుగా సామాజిక మాధ్యమాల్లో తెలియని లింకులు, సందేశాలు లేదా ఫ్రెండ్ రిక్వెస్టులను ఓపెన్ చేయరాదని, బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

సైబర్ భద్రత ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలనే సందేశాన్ని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ప్రజల్లో జాగ్రత్తలు పెంపొందించి, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ సీఐ నిస్సార్ భాషా, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, ఎస్సై రమేష్, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ రాజకిషోర్, ఇతర పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచి ప్రభుత్వం మన కోసం మన ఎంఎల్ఏ



ప్రత్తిపాడు, (జర్నలిస్ట్ ఫైల్):ఈ నెల 24 వ తేదీ నుండి నియోజకవర్గం లో మంచి ప్రభుత్వం మన కోసం మన ఎంఎల్ఏ కార్యక్రమం ను ప్రారంభించనున్నట్లు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల. రామాంజనేయులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నందు ఏర్పాటు చేసిన కార్యక్రమం లో భాగంగా ఎంఎల్ఏ రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికి చంద్రబాబు నాయుడు పెట్టిన సిక్స్, సూపర్ జీఎస్టి ల పథకాలతో దుసుకుపోతుందన్నారు. ఒక కుటుంబానికి లక్ష రూపాయలు లబ్ధి కలిగించే విధంగా ఉందన్నారు. రాష్ట్రం లో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి ఫలాలు పేదలు అందుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా రైతన్నలు కావలసిన ఎరువులు, విత్తనాలు, కిసాన్ యోజన పథకాలు సకాలంలో అందిస్తున్నారాన్నారు. చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 2047 విజన్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలు చేరువ గురించి మన కోసం మన ఎంఎల్ఏ కార్యక్రమం ను 8 సచివాలయాల పరిదిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం ల సిబ్బంది నీ కలుపుకొని ప్రభుత్వం అందించే పథకాల అమలు పై ప్రజలతో మమేకం అవనున్నట్లు తెలిపారు. ముందుగా నగర పాలక సంస్థ లోని గోరంట్ల నందు మంచి నీటి పథకం అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధమగా నడుస్తున్నమన్నారు. అమృత్ 2 పథకం ద్వారా 345 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, 27 కోట్లు వికర్ సెక్షన్ కాలనీల అభివృద్ధి కోసం నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతం లో కొంతమంది అభివృద్ధి పనులు ఎక్కువగా ఒకే కాంట్రాక్టర్ తీసుకున్నట్లు తమ దృష్టి కి వచ్చిందని అలాంటి వారి పై చర్యలు తీసుకోమని మున్సిపల్ కమిషనర్ కు తెలియజేశమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రత్తిపాడు సమీపంలో 250 ఎకరాలలో ఎకనామిక్ హబ్ నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమం లు శ్రీకారం చుడుతున్నామన్నారు. వైసిపి అసత్య ప్రచారాలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల అభివృద్ధికి అడుగులు : ఎమ్మెల్యే నసీర్

- బొంతపాడు నుంచి ఏటుకూరు వైపు రోడ్డు నిర్మాణం
- రూ.1.99 కోట్లతో శంకుస్థాపన చేసిన గుంటూరు ఎమ్మెల్యే నసీర్
- మంచినీటి సరఫరాతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్న ఎమ్మెల్యే
- కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ కోవెలమూడి నాని



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో విలీనమై ఎలాంటి మౌలిక వసతులు లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక తూర్పు నియోజకవర్గంలోని గుంటూరు కార్పొరేషన్ విలీన గ్రామమైన బొంతపాడు నుంచి ఏటుకూరు వైపు వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ. 1.99 కోట్లతో నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గుంటూరు కార్పొరేషన్ గా అవతరించాక చుట్టుపక్కల కొన్ని గ్రామాలు విలీనమయ్యాయని చెప్పారు. అయితే ఆయా గ్రామాలకు గుంటూరు నగరంలో కనెక్టివిటీ కోసం మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విలీన గ్రామాలకు రోడ్ల నిర్మాణం, మంచినీటి సదుపాయం, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులపై దృష్టి సారించామని తెలిపారు. ఇందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, మంచినీటి సరఫరా కూడా చేపడతామని వెల్లడించారు. రాష్ట్రంలో అమృత్ పథకం ద్వారా రూ. 440 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు. వర్షాల కాలంలో విలీన గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వీటికి శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, డివిజన్ అధ్యక్షులు బ్రహ్మసాని శ్రీనివాస్, ఏడుకొండలు, అబ్బాస్ అలీ, శ్రీకాంత్, గోపి, రహమతున్నిసా, సరోజ, హరికృష్ణ, శ్రీను, రాంబాబు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరా సంస్థ విజయానికి టీమ్ వర్క్, క్వాలిటీ పట్ల నిబద్ధతే మూలాధారం"

- శ్రీ భ్రమర టౌన్ షిప్ 10వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రసంగించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు ఆటోనగర్‌లోని ఏఎస్ కన్వెన్షన్ హాల్‌లో శ్రీ భ్రమరా టౌన్‌షిప్స్ 10వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గల్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ శ్రీ భ్రమరా కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా నమస్కారాలు. ఈరోజు నాకు ఎంతో ఆనందంగా ఉంది. కేవలం కొద్ది మంది ఉద్యోగులతో ప్రారంభమైన భ్రమరా సంస్థ, వేలాదిమంది కస్టమర్లు, మార్కెటింగ్ మిత్రులు, ఉద్యోగులు, డైరెక్టర్లతో ఈ స్థాయికి ఎదగడం నిజంగా గర్వకారణం. ఇది భగవంతుడి ఆశీర్వాదంతో పాటు, మీ అందరి నిబద్ధతకు నిదర్శనం." భ్రమరా అంటే క్వాలిటీ ఓవర్ క్వాంటిటీ అనే నమ్మకం. శ్రీ భ్రమరా టౌన్ షిప్ అధినేత శ్రీ గళ్ళా రామచంద్ర రావు వెనుక ఉన్న మీ అందరి బలం వలన ఈ విజయాన్ని అందుకున్నారు. భ్రమరా అంటే ఒక వ్యక్తి కాదు – అది ఒక టీమ్. ఈ సంస్థ యొక్క నిజమైన శక్తి మీరే అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.

ఎంత ఎదిగినా కూడా ఒదిగి ఉండడం మన సంస్కారం. అదే భ్రమరా విలువ. ఏదైనా లోపం ఉంటే దాన్ని అంగీకరించి వెంటనే సరిదిద్దుకునే వ్యక్తి రామచంద్ర గారు. అటువంటి వ్యక్తి అధినేతగా ఉన్న ఈ సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తాను బలంగా నమ్ముతున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

శ్రీ భ్రమర టౌన్ షిప్ అధినేత రామచంద్ర రావుకు, సంస్థ వెనుక ఉన్న మొత్తం బృందానికి అభినందనలు తెలుపుతూ, సంస్థ మరింత విస్తరించి, అనేక కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వం, సంతోషం అందించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

## శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

- పాతాళగంగ, గంగాధర మండపం, పుష్కరిణి ప్రాంతాల పర్యటన చేసిన ఈఓ శ్రీనివాసరావు



శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్) :ప్రతీ ఏటా అత్యంత వైభవంగా జరిగే కార్తీకమాసోత్సవాల కోసం శ్రీశైల దేవస్థానం భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఈ సంవత్సరం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 21 వం-కు జరుగనున్న ఈ మాసోత్సవాలను దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లను చేస్తున్నది.

ఈ నేపథ్యంలో బుధవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పాతాళగంగ, గంగాధర మండపం, పుష్కరిణి తదితర ప్రదేశాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో భక్తులు అధికసంఖ్యలో పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని పేర్కొన్నారు. పాతాళగంగ పరిసరాలను, మెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య విభాగ అధికారులను ఆదేశించారు.

పాతాళగంగలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. భక్తుల భద్రత కోసం దేవస్థానం ప్రత్యేక ఈతనిపుణులను నియమించినట్లు తెలిపారు. ఈతనిపుణులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఆయన ఆదేశించారు.

అదేవిధంగా పాతాళగంగ పరిసరాలు మరియు మెట్ల వెంబడి అవసరమైన చోట మరిన్ని విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. శౌచాలయాలను పరిశుభ్రంగా నిర్వహించాలనే దిశగా పారిశుద్ధ్య విభాగానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

తరువాత గంగాధర మండపం వద్ద నిర్వహించనున్న కోటీదీపోత్సవం ఏర్పాట్లను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గంగాధర మండపం నుండి నందిమండపం వరకు జరిగే కోటీదీపోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా పుష్కరిణీలో ప్రతి సోమవారం మరియు పౌర్ణమి రోజున జరిగే లక్షదీపోత్సవం, పుష్కరిణీ హారతి కార్యక్రమాల కోసం కూడా పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలన్నారు.

ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం. నరసింహారెడ్డి, సహాయక కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డి, 'శ్రీశైలప్రభ' సంపాదకులు డా. అనిల్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐ/సి) పి. చంద్రశేఖరశాస్త్రి, పి.వి. సుబ్బారెడ్డి మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## రాత్రివేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తప్పవు

- గుంటూరు జిల్లా ఎస్పీ హెచ్చరిక
- శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక డ్రైవ్‌లో 637 కేసులు నమోదు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి సమయాల్లో అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. అక్టోబర్ 15 నుంచి 21 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, రాత్రివేళల్లో కారణం లేకుండా తిరిగిన 639 మందిని గుర్తించి, వారిపై "టౌన్ న్యూసెన్స్ యాక్ట్" ప్రకారం 637 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్పీ మాట్లాడుతూ, గుంటూరు నగరం సహా జిల్లా పట్టణాల్లో కొంతమంది యువకులు రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ప్రజల భద్రతకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు బహిరంగంగా మద్యం సేవిస్తూ గొడవలు, దాడులు జరిపి ప్రజల్లో భయాందోళన సృష్టిస్తున్నారని చెప్పారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఎవరికీ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వమని హెచ్చరించారు.

రాత్రివేళల్లో అకారణంగా తిరిగేవారిపై, బైకులపై విన్యాసాలు చేస్తూ ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు. "వారం రోజుల వ్యవధిలోనే 639 మందిపై కేసులు నమోదు చేశాం. అవసరమైతే కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తాం. భవిష్యత్తులో కూడా ఇదే పంథాను కొనసాగిస్తాం," అని అన్నారు.

జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులకు సున్నితమైన ప్రాంతాల్లో రాత్రి గస్తీని పటిష్టం చేయాలని, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్నవారి కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. ప్రజల భద్రత పోలీసుల బాధ్యతగా భావిస్తూ ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

అవసరమైతే సినిమా హాళ్లు, ఆసుపత్రులు, మందుల దుకాణాలు లేదా ప్రయాణాలకు సంబంధించిన అవసరాలతో రాత్రివేళల్లో బయటకు వచ్చే వారు తమ వద్ద ఉన్న గుర్తింపు పత్రాలను పోలీస్ తనిఖీల సమయంలో చూపించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. "రాత్రివేళల్లో ఆకతాయితనానికి, రౌడీ కార్యకలాపాలకు గుంటూరు జిల్లాలో స్థానం లేదు. చట్టం ఉల్లంఘిస్తే ఎవరినీ వదలము," అని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామీణాభివృద్ధి,సంక్షేమ పథకాల అమలుకు సహకరిస్తా



- జిల్లా పరిషత్ చైర్మన్ ను కలిసిన.వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం.గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాని మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు.సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల పురోభివృద్ధి, విద్యా సంస్థల బలోపేతం, ఆరోగ్య సదుపాయాల మెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వంటి పలు అంశాలపై చర్చ జరిగింది. వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీసుకుంటున్న ప్రజాకేంద్రీకృత నిర్ణయాలను ప్రశంసిస్తూ, గ్రామీణాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా కత్తెర హెనీ క్రిస్టినా జిల్లా పరిషత్ చేపడుతున్న పథకాలపై వివరాలు తెలియజేసి, ప్రజల సేవలో పారదర్శకత, సమర్థతను మరింతగా పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు.

ఈ సందర్భం జిల్లా గ్రామీణాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఇద్దరూ కలసి పనిచేయాలనే సంకల్పాన్ని ప్రతిబింబించింది.

## మంచి సాహిత్యంతోనే మానవ సంబంధాలు మెరుగు



- యూనివర్సిటీలు లిటరేచర్ కోర్సులను ప్రవేశ పెట్టాలి
- ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి ఓల్గా పిలుపు
- ఎస్ఆర్ఎం వర్సిటీలో అమరావతి సాహిత్య ఉత్సవం ప్రారంభం

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :విలువలతో కూడిన సాహిత్యంతో మానవ సంబంధాలు మెరుగుపడతాయనీ, ఆరోగ్యకరమైన సమాజం కనుల ముందుకు వస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత రచయిత్రి పి లలితకుమారి (ఓల్గా) పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో బుధవారం ఉదయం అమరావతి సాహిత్య ఉత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో ప్రాశ్చాత్య పోకడలు పెరిగి నైతిక విలువలు పతనమవుతున్నాయని, అంతటా హింస ప్రవృత్తి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, మెడికల్, న్యాయ కళాశాలల్లో మానవ విలువలను పెంపొందించే ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని సూచించారు.

మంచి సాహిత్యం మానవ మనుగడను సుసంపన్నం చేస్తుందని, యువత భవితవ్యాలను ఉజ్వలం చేస్తుందన్నారు. శ్రీశ్రీ, వేమన, కరుణశ్రీ, గురజాడ వంటి పేరున్న కవుల కలం నుంచి జాలువారిన సాహిత్యం ఇప్పటికీ ఆధునిక యువతను ప్రభావితం చేస్తుందన్నారు. తన సోదరి ఓల్గా మరణానంతరం ఆమె పేరును తన కలం పేరుగా మార్చుకుని రచనలు చేస్తున్నానని వివరించారు. పర్సనాలిటీ డెవలప్మెంట్ కోర్సుల కోసం పరుగులు తీయడం అనవసరమంటూ మంచి సాహిత్యం ఉన్న పుస్తకాలను పఠ నం చేయడం సరిపోతుందన్నారు.

యూనివర్సిటీ ఇన్ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ భాషలు, వాటి సాహిత్య విలువలను విద్యార్థుల్లో ప్రేరేపించే ప్రక్రియలో భాగంగా తొలిసారి వర్సిటీలో అమరావతి సాహిత్య ఉత్సవాన్ని ఏర్పాటు చేశామన్నారు. కవులు, విమర్శకులు, సాహిత్యాభిలాషులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి ఆలోచనల నుంచి వచ్చే నూతన సృజనలకు ప్రాణం పోయాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆమ్లాన్ బైశ్య మూడు రోజుల కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి హజరైన సాహిత్యవేత్తలను పరిచయం చేశారు. అనంతరం ముఖ్య అతిథి వోల్గాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్, లిబరల్ ఆర్ట్స్ స్కూల్ డీన్ డాక్టర్ బిష్ణు పథ్, విభాగాధిపతి డాక్టర్ శయంటిన్ ఠాగూర్ తదితరులు ప్రసంగించారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి : ఎంఎల్ఏ రామాంజనేయులు

ప్రత్తిపాడు (జర్నలిస్ట్ ఫైల్):ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతాంగానికి అందుబాటులో ఉంటూ అధిక వర్షాలకు పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి తెలియజేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం ఎంఎల్ఏ బి. రామాంజనేయులు తెలిపారు. ఎంఎల్ఏ కార్యాలయం నందు ప్రత్తిపాడు నియోజకవర్గం పరిదిలో గల ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో ఎంఎల్ఏ రామాంజనేయులు రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు సరైన సమయానికి సరఫరా చేయాలని తెలిపారు. వర్షాలు అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామ స్థాయిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ గ్రామాలలో అందుబాటులో ఉండాలన్నారు. పంట నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఐదు మండల అధికారులు , సొసైటీ చైర్మన్ లు ,తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఆక్వా రంగ అభివృద్ధికి మంత్రి లోకేష్ కృషి అభినందనీయం

- ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం ఏపీ రైతులకు కొత్త అవకాశాలకు నాంది
- ఏపీ ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఎగుమతులకు మంత్రి లోకేష్ ప్రాధాన్యం
- అమెరికా అధిక సుంకాల నేపథ్యంలో కొత్త అంతర్జాతీయ మార్కెట్లు అన్వేషించే లోకేష్ దృష్టి ప్రశంసనీయం
- ఆస్ట్రేలియాలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా మంత్రి లోకేష్ ఆలోచనలకు మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్ర ఆక్వా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయం అని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాతో ఆక్వా బంధం కొత్త అవకాశాలకు నాంది కానుందని ఆయన అన్నారు. అమెరికా విధించిన అధిక సుంకాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏపీ ఆక్వా ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు కల్పించాలనే లోకేష్ దూరదృష్టి ప్రశంసనీయం అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఏపీ ఆక్వా రైతుల అభివృద్ధి దిశగా ఆలోచించిన మంత్రి లోకేష్ నిబద్ధతను ఆయన అభినందించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యత పెంపు, నిల్వ సామర్థ్యం, ప్రాసెసింగ్, కోల్డ్ చైన్, ప్యాకేజింగ్ రంగాల్లో ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు.

ఏపీ సీ ఫుడ్ బ్రాండ్‌కి అంతర్జాతీయ గుర్తింపు తేవాలన్న మంత్రి లోకేష్ సంకల్పం రాష్ట్రానికి గౌరవం తెస్తుందని అన్నారు. రాష్ట్రానికి 1,000 కిలోమీటర్ల విస్తీర్ణం గల సముద్రతీరం ఆక్వా పరిశ్రమకు బలమైన ఆధారమని, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం చురుకుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక రంగాల్లో మంత్రి లోకేష్ చూపుతున్న ప్రగతిశీల ఆలోచనలను ప్రశంసిస్తూ, వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలకు తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. రైతులకు స్మార్ట్ ఫార్మింగ్ టెక్నాలజీ అందించే చర్యలు ప్రశంసనీయం అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడుల వర్షం కురుస్తోందని, ఆక్వా రంగం అభివృద్ధి ద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలి

- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చొరవ తీసుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :దేశవ్యాప్తంగా ఇప్పటికే సేవల్లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించాలన్న డిమాండ్ మరోసారి ఉధృతమైంది. ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరికీ కూడా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరి చేసిన నేపథ్యంలో, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) తాజాగా కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది.

2017 పార్లమెంట్ తీర్మానం ఆధారంగా సుప్రీం కోర్టు ఇచ్చిన ఈ తీర్పులో, ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు రానున్న రెండు సంవత్సరాల్లో టెట్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందని పేర్కొంది. దీంతో దేశవ్యాప్తంగా వేలాది మంది సీనియర్ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈ నేపథ్యంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో స్పందించారు. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు కోరారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ విషయంపై దృష్టి సారించి, పార్లమెంటులో తగిన తీర్మానం ఆమోదించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వారంటూ, “సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వడం సముచితం. లేదంటే వేలాది మంది ఉపాధ్యాయులు ఆందోళనలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది” అని పేర్కొన్నారు.

## గిరిజనుల ఆత్మ గౌరవానికి ప్రతీక కొమరం భీమ్



- చరిత్ర మరువని పోరాట యోధుడు కొమరం భీం

**పురిటిగడ్డ (జర్నలిస్ట్ ఫైల్)** :నాటి బ్రిటిష్ కాలంలో నిజాం రాజుల నియంతృత్వ చట్టాలకు వ్యతిరేకంగా ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి ప్రశంసనీయమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. పురిటిగడ్డ ఎస్టీ కాలనీలో కొమరం భీం 125వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ గిరిజనుల అస్తిత్వం కోసం జల్,జంగల్,జమీన్ నినాదంతో కొమరం భీమ్ బ్రిటిష్ కాలంలో దోపిడీదారులపై చారిత్రాత్మక పోరాటం చేశారన్నారు. ఆదివాసీలలో చైతన్యం,పోరాట స్ఫూర్తి నింపిన కొమరం భీమ్ చరిత్ర మరవని పోరాటయోధుడిగా గుర్తింపు పొందారన్నారు. కొమరం భీం చేసిన పోరాటమే నేటి ఆదివాసీ హక్కులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టా ప్రసాద్,రమాదేవి,కుంభా లక్ష్మీదుర్గ,కనకదుర్గ,లక్షణ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ-యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేందుకు సహకరించండి

- షిప్ బిల్డింగ్ నుంచి డేటా సెంటర్ల వరకు ఏపీలో అపారమైన అవకాశాలు
- యూఏఈలోని తెలుగువారి అభివృద్ధికి తోడ్పాటు అందించండి
- మోదీ చొరవతోనే దేశంలో విప్లవాత్మక మార్పులు
- దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో జరిగిన భేటీలో సీఎం





**దుబాయ్:** ఆంధ్రప్రదేశ్-యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులను కోరారు. పెట్టుబడుల సాధనకు, నవంబర్ నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం సీఎం చంద్రబాబు దుబాయ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా దుబాయ్, అబుదాబి దేశాల్లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. దుబాయ్ ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ కంపెనీల వివరాలు, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిథ్య రంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. గూగుల్ సంస్థ విశాఖలో అతిపెద్ద డేటా ఏఐ హబ్ 15 బిలియన్ డాలర్లతో పెట్టుబడులు పెడుతోందని సీఎం వారికి వివరించారు. ఏపీకి 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం వివరించారు. యూఏఈ దేశాల సావరీన్ ఫండ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపైనా వారితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆంధ్రప్రదేశ్ లో వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా దుబాయ్ సహా వివిధ దేశాల కంపెనీలకు వివరించాలని ఎంబసీ ప్రతినిధులకు సీఎం సూచించారు. యూఏఈ -ఏపీ పారిశ్రామిక బంధం దృఢంగా ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ దేశాలకు చెందిన వివిధ సంస్థలు ముందుకు వచ్చిన నేపథ్యంలో ఏపీలో ఉన్న అవకాశాలను ఆయా దేశాల్లోని కంపెనీలకు వివరించాలని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్రప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని... యూఏఈలోని వివిధ సంస్థలను ఆ సదస్సుకు ఆహ్వానిస్తున్నామని దుబాయిలోని భారత ఎంబసీ ప్రతినిధులకు సీఎం తెలిపారు. ప్రధాని మోదీ చొరవ వల్లే దేశంలో చాలా మార్పులు వచ్చాయని.. భారత్ ను పెద్ద ఎత్తున ఆయన ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెరగడానికి ప్రధాని చేస్తున్న కృషే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు.

**విద్య వైద్య రంగాల్లో యూఏఈ ఆసక్తి**

ట్రేడ్ అండ్ టెక్నాలజీ రంగంలో భారత్ దేశానికి యూఏఈ భాగస్వామిగా ఉందని దుబాయ్‌లోని కాన్సులేట్ జనరల్ సతీష్ కుమార్ శివన్ వివరించారు. ఇరుదేశాల పరస్పర పెట్టుబడులతో బంధం మరింత బలపడిందని సీఎంకు వివరించారు. మూడేళ్లలో 50 శాతం మేర ఇరుదేశాల మధ్య వాణిజ్యం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం యూఏఈ టెక్నాలజీ రంగంపై ఎక్కువగా వ్యయం చేస్తోందని భారత్ నుంచి వచ్చే నిపుణులకు భారీ ఎత్తున అవకాశాలు ఉన్నాయని సీఎంకు వివరించారు. ప్రస్తుతం యూఏఈ నాన్ ఆయిల్ ఎకానమీ వైపుగా దృష్టి పెట్టిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై యూఏఈ 2017లోనే ఓ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసిందని సీఎంకు సతీష్ కుమార్ శివన్ తెలిపారు. మరోవైపు యూఏఈలో 23 బిలియన్ డాలర్ల పెట్టుబడులు భారత్ పెట్టిందని ఇందులో 50 శాతం గత ముడేళ్లలో వచ్చినవేనని యూఏఈలోని డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ఏ.అమర్నాధ్ తెలిపారు. భారత్ లోని విద్య వైద్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈ ఆసక్తి చూపుతోందని వివరించారు. గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ పార్క్ లోనూ యూఏఈ నుంచి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అమర్నాధ్ తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సీఎంకు సాదర స్వాగతం**

దుబాయ్‌లోని అంతర్జాతీయ స్థాయి సంస్థలకు అవసరమైన టెక్నాలజీ నిపుణులను అందించేందుకు ఏపీ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. యూఏఈలో తెలుగువాళు ఉన్నారని...వారికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఎంబసీ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. దుబాయ్ లో తన పర్యటన చివరి రోజున తెలుగు డయాస్పోరా కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. అంతకు ముందు హైదరాబాద్ నుంచి దుబాయ్ కు చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు స్థానిక తెలుగు ప్రజలు విమానాశ్రయానికి వచ్చి ఘనంగా స్వాగతం పలికారు. దుబాయిలో ఉన్న తెలుగు వారు.. ప్రత్యేకించి మహిళలు తెలుగు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి ముఖ్యమంత్రికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం తెలియచేశారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని సీఎం అప్యాయంగా పలకరించారు.

# మీది...చీకటి పాలన జగన్!

- వెలుగు గురించి మాట్లాడే హక్కు నీక్కెక్కడిది!
- నిప్పులు చెరిగిన మంత్రి సత్యకుమార్ యాదవ్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :గత వైకాపా పాలనలో రాష్ట్ర ప్రజలకు నరకమెంటో ప్రత్యక్షంగా చూపి, చీకటి పాలన అందించిన జగన్రెడ్డి కూటమి ప్రభుత్వ హయాంలో వెలుగులు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. ఇప్పటికీ గత వైకాపా చీకటి పాలన గురించి తలుచుకొని ప్రజలువణికిపోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వైకాపా హయాంలో ప్రతి ఇంటిని కమ్మేసిన చీకటిని ఎన్డీఏ ప్రభుత్వం తరిమేసి, వెలుగులు నింపుతుండగా జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే దక్కి ఇంటికి పరిమితమైన జగన్ కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వెలగని దీపాలుగా ప్రకటనలు చేస్తుండడం ఆయన అవివేకానికి నిదర్శమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుదీర్ఘకాలం జైల్లో నాలుగు గోడల మధ్య చీకట్లో మగ్గి బయటకొచ్చిన జగన్ వెలుగును చూసి ఇప్పటికీ తట్టుకోలేక... పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని మంత్రి సత్యకుమార్ బుధవారం విడుదలచేసిన ప్రకటనలో నిప్పులు చెరిగారు.

మూడు రాజధానుల పేరుతో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయగా.. ప్రస్తుత సీఎం చంద్రబాబు వికేంద్రీకరణ విధానంతో అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం పునర్నిర్మాణం దిశగా వేగంగా అడుగులువేస్తోందని తెలిపారు.

**వెల్లువలా పెట్టుబడులు.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు!**

“2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనకు కృషి జరుగుతోంది. ఈ సంకల్పానికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం మరింత శక్తినిస్తుంది. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దార్శనికతతో రాష్ట్రం సరికొత్త శక్తిగా అవతరించబోతుంది. డబుల్ ఇంజన్ సర్కారు కృషితో రాష్ట్రానికి రూ. 11 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. ఐదారు లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. పోలవరానికి రూ. 12,500 కోట్లు, అమరావతికి రూ. 15వేల కోట్లు, విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ. 11,450 కోట్లు, నేషనల్ హైవేకు రూ. 70వేల కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ. 70వేల కోట్లు, కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్లకు రూ. వేల కోట్ల నిధులు కేంద్రం నుంచి వస్తున్నాయి. గూగుల్ సంస అమెరికా వెలుపల తొలిసారిగా దేశంలోనే విశాఖలో కృత్రిమ మేధ హబ్ ఏర్పాటు చేయబోతుంది.

**ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు**

ఎన్డీఏ ప్రభుత్వ సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయి. తల్లికి వందనం, స్త్రీ శక్తి, మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, దీపం-2 అమలు వంటి సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఇంటికి చేరుతున్నాయి. నాటి జగన్ పాలనలో వైద్య రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. కూటమి ప్రభుత్వం వైద్య సేవలు మెరుగుపరుస్తున్నందున ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ, ఐపీ సేవలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పించబోతుంది. 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరును ప్రశంసించి, కేంద్రం రూ. 100 కోట్లను ప్రోత్సాహకరంగా అందచేసింది.

**జగన్ పాలన విధ్వంసంతోనే ప్రారంభం!**

నాటి జగన్ పాలన ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభమైంది. రాజధాని అమరావతి అభివృద్ధిని జగన్ తొక్కేశారు. పోలవరం ప్రాజెక్టు అమలును నీరుగార్చారు. గత వైకాపా హయాంలో జరిగిన డీబీటీ మోసాలు అన్నీ ఇన్నీ కావు.

బోధనా రుసుముల చెల్లింపుల విధానాన్ని అస్తవ్యస్తంచేశారు. దశలవారీ మద్య నిషేధ హామీని అటకెక్కించారు. నకిలీ మద్యం విక్రయాలతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారు. మద్యం విక్రయాల్లో సరికొత్త దోపిడీకి తెరదీశారు.’ అని సత్యకుమార్ ధ్వజమెత్తారు.

## తునిలో మైనర్ బాలికపై అత్యాచారయత్న ఘటనపై “మహిళా కమిషన్” సీరియస్

- ఆ కీచకుడి భరతం పట్టండి..
- కాకినాడ ఎస్పీని కోరిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ
- బాలికల భద్రతకు విరుద్ధంగా పనిచేస్తే ఏ స్థాయివారైనా వదలొద్దంటూ ఆదేశాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** :కాకినాడ జిల్లా తునిలో మైనర్ గురుకుల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్న ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని పాఠశాల నుంచి తోటల్లోకి తీసుకెళ్ళి వేధించిన కీచకుడి ఉదంతం బుధవారం సోషల్ మీడియాలో దుమారం రేగింది. దీనిపై తక్షణమే స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు. ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. ఈ ఉదంతంపై కమిషన్ సుమోటోగా కేసును స్వీకరిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ స్థాయి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనని చెప్పారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి నివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పించాలంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల పాఠశాలల్లో భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీకు లేఖల ద్వారా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు విరుద్ధమైన ఏ చర్యలైనా కమిషన్ సహించదని, నిందితులకు కఠినమైన శిక్ష విధించేలా న్యాయ ప్రక్రియను పర్యవేక్షిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# కల్తీ మద్యం పాపాత్ముడు జగనే : మంత్రి సవిత ఫైర్

- కూటమి ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగేలా కుట్రలు
- తాడేపల్లి ప్యాలెస్ లో కల్తీ మద్యం తయారీకి ప్రణాళికలు
- జగన్ హయాంలో ఏరులైన పారిన కల్తీ మద్యం
- కల్తీ మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి రూ.3,500 కోట్ల దోపిడి
- డైవర్షన్ రాజకీయాలకు తెరతీసిన జగన్ అండ్ కో
- కల్తీ మద్యం, బెల్ట్ షాపులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం
- సురక్షా యాప్ తో కల్తీ మద్యం అమ్మకాలకు అడ్డుకట్ట
- త్వరలోనే కల్తీ మద్యం తయారీ వాస్తవాలు బయటపెడతాం : మంత్రి సవిత



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : కల్తీ మద్యం పాపాత్ముడు జగనే అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. అయిదేళ్ల జగన్ పాలనలో కల్తీ మద్యం ఏరులై పారిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ట మంటగలిపేలా తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా కల్తీ మద్యం తయారీ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అయిదేళ్ల జగన్ పాలనలో జే బ్రాండ్ పేరుతో కల్తీ మద్యానికి అధికారిక ముద్ర విచ్చలవిడిగా అమ్మకాలు చేశారన్నారు. ఆ 5 ఏళ్లలో కల్తీ మద్యం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 30 లక్షల మంది అమాయకులు అనారోగ్యం పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జంగారెడ్డి గూడెంలో కల్తీ నాటుసారా తాగి 27 మంది ప్రాణాలు కోల్పోతే కనీసం పోస్టు మార్టమైనా చేయకుండా, విచారణ జరపకుండా కేసు తప్పుదారి పట్టించారన్నారు. గతంలో విజయవాడలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బార్ లో కల్తీ మద్యం తాగి ఆరుగురు మృతిచెందడం వాస్తవం కాదా..? అని నిలదీశారు. 2014 ఎన్నికల సమయంలో సర్వేపల్లి, కావలి నియోజక వర్గాల వైసీపీ అభ్యర్థులు కాకాణి గోవర్దన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పంపిణీ చేసిన కల్తీ మద్యంతాగి ఎందరో అమాయకులు మరణించడం నిజం కాదా..? అని ప్రశ్నించారు. జగన్ అయిదేళ్ల పాలనలో బ్రాండెడ్ మద్యం అమ్మకాలను నిలిపేసి, జే బ్రాండ్ పేరుతో కల్తీ మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి, పేదల రక్తమాంసాలు పీల్చిపిప్పి చేసి రూ. 3,500 కోట్లు దోచుకున్నారన్నారు. దోచుకున్న డబ్బుతో ఆఫ్రికా దేశాల్లో కల్తీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారన్నారు. ఇదే విషయం కామెరూన్ లో అక్కడి మంత్రి చెప్పడం వాస్తవం కాదా రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్‌ను సీజ్ చేయడం నిజం కాదా..? అని ప్రశ్నించారు.

**తాడేపల్లి ప్యాలెస్ లో కుట్రలు**

కూటమి ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగేలా తాడేపల్లి ప్యాలెస్ లో కల్తీ మద్యం తయారీ ప్రణాళికలు రచిస్తున్నారని మంత్రి సవిత విమర్శించారు. నకిలీ మద్యం తయారీకి జోగి రమేష్, ఏ-1 జనార్దన రావు జగన్ ఇంటిలోనే ప్రణాళికలు రచించారన్నారు. రాష్ట్రంలో అలజడి, అశాంతిని సృష్టించడానికి కుట్రలు పన్నుతున్నారని వైసీపీ నాయకులపై మంత్రి సవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. అయిదేళ్ల జగన్ పాలనలో కల్తీ మద్యం అక్రమాలు బయటకొస్తుండడంతో, డైవర్షన్ రాజకీయాలకు వైసీపీ నాయకులు తెరతీశారన్నారు.

**కల్తీ మద్యంపై ఉక్కుపాదం**

రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, అమ్మకాలపై సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని మంత్రి సవిత వెల్లడించారు. జగన్ హయాంలో మూడు లక్షలకు పైగా బెల్ట్ షాపులుంటే, ప్రస్తుతం వాటిని పూర్తిగా మూయించామని తెలిపారు. బెల్ట్ షాపు తెరిస్తే రూ. 5 లక్షల ఫైన్ వేస్తున్నామన్నారు. మొలకల చెరువు మద్యం తయారీ ఘటనపై ఇప్పటికే అయిదుగురు ఐపీఎస్ లతో సిట్ ఏర్పాటు చేశామని, త్వరలోనే వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామని మంత్రి సవిత వెల్లడించారు. కల్తీ మద్యం ఆరోపణలు రాగానే, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన జయచంద్రారెడ్డిని, కట్టా సురేంద్రనాయుడిని సీఎం చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఇదీ తమ పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు. కల్తీ మద్యంలో నిందితులుగా ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, ఇతర వైసీపీ నాయకులను పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని మంత్రి ప్రశ్నించారు. జగన్ కు, తాడేపల్లి ప్యాలెస్ కు కల్తీ మద్యం పాత్ర ఉండబట్టే, వారిని వెనుకేసుకొస్తున్నారన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అడ్డుకట్ట వేయడానికి సురక్షా యాప్ రూపొందిస్తున్నామన్నారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరులో నూతన మద్యం పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం నాణ్యతను పరీక్షించడానికి 13 రకాల ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఐ) పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. దేశ, విదేశాలకు బ్రాండ్ మద్యాన్ని అందుబాటులో ఉంచామన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467